



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY



ఈ స్థలం [22 సెంట్లు]

అమ్మబడును




సంప్రదించవలసిన నెంబర్లు

కె. అబెడ్నేగో(రాజు బాబు ) : 9985998066

సిహెచ్. సురేష్ : 9959996243

RAYAVARAM MANDAL, RAYAVARAM VILLAGE, EGDT : 533346



SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 159 | తూర్పుగోదావరి జిల్లా | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | సోమవారం 02 మార్చి 2026 | పేజీలు : 12 | వెల : 2/-




## సిఆర్‌డిఏ ఆధ్వర్యంలో రూ.210 కోట్లతో
# 36 జడ్జీల బంగ్లాలు నిర్మాణం

**అమరావతిలో హైకోర్టు జడ్జీల నివాస గృహ సముదాయాన్ని ప్రారంభించిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్**
**పాల్గొన్న రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు**

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర రాజధాని అమరావతిలో నిర్మించిన హైకోర్టు న్యాయమూర్తుల నివాస గృహాల సముదాయాన్ని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆదివారం ప్రారంభించారు. సిఆర్‌డిఏ ఆధ్వర్యంలో రూ.210 కోట్ల వ్యయంతో 33.20 ఎకరాల విస్తీర్ణంలో 36 మంది హైకోర్టు న్యాయమూర్తుల కోసం ఆధునిక సౌకర్యాలతో నివాస గృహాలను నిర్మించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని అదనంగా మరో 13 బంగాళాలను నిర్మించేందుకు తగిన స్థలాన్ని కూడా కేటాయించారు. ప్రతి నివాస గృహాన్ని 7,841 చదరపు అడుగుల విస్తీర్ణంలో జీ ప్లస్ వన్ నమూనాలో నిర్మించారు. న్యాయమూర్తుల అవసరాలకు అనుగుణంగా ఆఫీసు గది, వెయిటింగ్ హాల్ తదితర వసతులతో ఈ గృహాలను సమగ్రంగా రూపొందించారు. బీఎస్ఆర్ ఇన్ఫ్రాటెక్ సంస్థ నిర్మాణ బాధ్యతలను నిర్వర్తించింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో నివాస సముదాయ ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆవిష్కరించారు. అనంతరం జడ్జిల బంగ్లాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జె.కె. మహేశ్వరి, మిగతా .. 2లో..

### ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన
# మంత్రి ఆనం



**నెల్లూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** నెల్లూరు జిల్లా సంగంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ భవనంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ఆనం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర రాకపోవడం, నిల్వ చేయలేక ఇబ్బందులు పడటం అనేకసార్లు చూశానని, రైతు కంట కన్నీరు చూసిన సందర్భాలు అనేకం ఉన్నాయని అన్నారు. "గత ప్రభుత్వం రైతుల కష్టాలు పట్టించుకున్న పాపాన పోలేదు. అటువంటి దయనీయ పరిస్థితులు రానివ్వకూడదనేదే కూటమి ప్రభుత్వ లక్ష్యం. ఆ పరిస్థితులు 90 శాతం మారాయి. రైతులు దళారుల బారిన పడటం, డబ్బు కోసం తిరిగే పరిస్థితులు ఇప్పుడు లేవు. కూటమి ప్రభుత్వం మిగతా .. 2లో..

### దేశవ్యాప్తంగా మొదలైన
# హెచ్‌పీవీ వ్యాక్సినేషన్

**అజ్‌మేర్‌లో ప్రారంభించిన ప్రధాని మోదీ**



**జైపూర్, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశవ్యాప్తంగా హెచ్‌పీవీ టీకా కార్యక్రమం ప్రారంభమైంది. శనివారం రాజస్థాన్‌లోని అజ్‌మేర్‌లో ప్రధాని నరేంద్ర మోదీ దీనిని ప్రారంభించారు. మహిళల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌తో పాటు, నివారించదగిన మరికొన్ని రకాల క్యాన్సర్లను అరికట్టడమే లక్ష్యంగా కేంద్రం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ముఖ్యంగా హ్యూమన్ ప్యాపిలోమావైరస్(హెచ్‌పీవీ)ని ఇది అరికడుతుంది. ఇందులోభాగంగా 14 సంవత్సరాల బాలికలకు సింగిల్ డోస్ మిగతా .. 2లో..

# నెల్లూరు జీజీహెచ్‌లో అగ్ని ప్రమాదం..
## పిల్లల వార్డులో మంటలు

**నెల్లూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** నెల్లూరు జీజీహెచ్‌లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పిల్లల వార్డులో మంటలు వ్యాపించాయి. గర్భిణులు, బాలింతలు, ఆస్పత్రి సిబ్బంది భయంతో పరుగులు తీశారు. దట్టమైన పొగతో రోగులు, పిల్లలు ఉక్కిరి బిక్కిరయ్యారు. దీంతో అధికారులు ఆస్పత్రికి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

### తప్పుడు ప్రచారం చేస్తున్న వారిని
# వదిలిపెట్టను
## బీఆర్ నాయుడు



**తిరుపతి, విశ్వం వాయిస్ న్యూస్ :** కుంభకోణాల్లో ఇరుక్కున్న వాళ్లు తనపై దుష్ప్రచారాలు చేస్తున్నారని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. తితిదే ఛైర్మన్‌గా నిస్వార్థంగా పనిచేస్తుంటే తనపై ఉద్దేశపూర్వకంగా బురదచల్లుతున్నారని మండిపడ్డారు. తిరుపతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓ వీడియోతో తనపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. "నాకు ఈ పదవి బతుకుదెరువు కాదు.. ప్రక్షాళన చేద్దామనే ఇక్కడికి వచ్చా. సామాన్య భక్తులకు పెద్దపీట వేయాలని సీఎం నన్ను నియమించారు. దానికి అనుగుణంగా పనిచేస్తున్నా. అసత్య ప్రచారాలకు నేనేమీ బెదరను.. నా పని నేను చేసుకుంటూ వెళ్తా. అసలు మిగతా .. 2లో..

### వేట్లపాలెం బాణాసంచా దుర్ఘటన బాధితులకు
# అండగా కూటమి ప్రభుత్వం

**బాధితుల ఇళ్ల వద్దే రూ. 20 లక్షల ఎక్స్ గ్రేషియా చెక్కులు స్వయంగా అందజేసిన మంత్రి**
**మీ ఇంట్లో బిడ్డగా అండగా ఉంటామంటూ బాధిత కుటుంబాలను ఓదార్చిన మంత్రి కందుల దుర్గేష్**

**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు మంత్రి కందుల దుర్గేష్ ఆదివారం కాకినాడ జిల్లా సామర్లకోట మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా వేట్లపాలెం గ్రామంలోని బాణాసంచా తయారీ కేంద్రంలో జరిగిన దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు.వారిని చూసి మంత్రి దుర్గేష్ చలించిపోయారు. ప్రభుత్వం తరపున బాధిత కుటుంబాలకు రూ. 20 లక్షల చొప్పున ప్రకటించిన ఎక్స్ గ్రేషియా మిగతా .. 2లో..



### అంగన్వాడీ సిబ్బంది సంక్షేమానికి
# కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**రెండు సార్లు అంగన్వాడీ వేతనాలు పెంచిన ఘనత చంద్రబాబుదే**
**అంగన్వాడీలకు ప్రతి నెల ఒకటో తేదీనే వేతనాలు అందేలా చర్యలు**
**హోం మంత్రి వంగలపూడి అనిత**

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, చిరు ఉద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని హోం మంత్రి అనిత తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా చరిత్రలోనే తొలిసారిగా రెండు సార్లు అంగన్వాడీ వేతనాలు పెంచిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానికీ, ముఖ్యంగా సీఎం చంద్రబాబుకే దక్కుతుందని ఆమె పేర్కొ న్నారు. ఎన్నికల్లో మిగతా .. 2లో..



# గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్తత..
### ప్రవాస తెలుగువారి కోసం స్పీకర్ అయ్యన్న ఆరా



**నర్సీపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా దాడులు చేస్తున్న నేపథ్యంలో గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో బహ్రెయిన్‌లో నివసిస్తున్న ప్రవాస తెలుగువారి భద్రతపై ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆరా తీశారు. బహ్రెయిన్‌లోని అమెరికన్ నావల్ బేస్‌పై ఇరాన్ దాడులు చేస్తున్న తరుణంలో అక్కడ ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సుమారు 50 వేల మంది వరకు అక్కడ వివిధ ఉద్యోగాలు చేస్తున్నారు. ముఖ్యంగా నర్సీపట్నం పరిసర ప్రాంతాలకు చెందిన అనేక మంది ఉపాధి నిమిత్తం బహ్రెయిన్ వెళ్లారు. నాతవరానికి చెందిన ఎన్నారై శెట్టి సతీశ్‌కు స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్వయంగా ఫోన్ చేసి, అక్కడి తెలుగువారి మిగతా .. 2లో..


### ఉద్యమ స్ఫూర్తితో
# ఉద్యమి సభ్యత్వ నమోదు

**జనసేన పిఏసి ఛైర్మన్ నాదేండ్ల మనోహర్**



**తిరుపతి, విశ్వం వాయిస్ న్యూస్ :** జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు గడువు పెంపు ఉండదని ఆ పార్టీ పిఏసి ఛైర్మన్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదేండ్ల మనోహర్ వెల్లడించారు. ఈనెల 14వ తేది పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఉన్నందున ఎట్టిపరిస్థితుల్లోనూ ఈ నెల 10వ తేదీ లోపు ఉద్యమి సభ్యత్వ నమోదును సాధక్‌లు పూర్తి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గం జనసేన పిఓసి, సాధక్‌లు, ముఖ్యనాయకులతో ఆదివారం ఉదయం నగరంలోని మిగతా .. 2లో..

### భారత్-అమెరికాల
# వాణిజ్య ఒప్పందం రైతులకు ముప్పు



**బర్నాలా, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత్-అమెరికా మధ్య కుదిరిన తాత్కాలిక వాణిజ్య ఒప్పందం దేశీయ రైతాంగాన్ని దెబ్బతీస్తుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. శనివారం పంజాబ్‌లోని బర్నాలాలో నిర్వహించిన మజ్దూర్ కిసాన్ మహార్యాలీలో ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ రంగాన్ని విదేశీ మార్కెట్లకు అనుకూలంగా మార్చే అంశంపై ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఈ ఒప్పందం నాలుగు నెలలుగా నిలిచిపోయిందన్నారు. 'ప్రధాని నాలుగు నెలలుగా చేయని పనిని, 15 నిమిషాల్లో ఎలా చేశారు? ఆకస్మికంగా నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఏమొచ్చింది?' అని ఆయన ప్రశ్నించారు. ఏటా అమెరికా నుంచి సుమారు రూ.తొమ్మిది లక్షల కోట్ల విలువైన ఉత్పత్తులను భారత్ కొనుగోలు చేస్తుందని ట్రంప్‌నకు ప్రధాని మోదీ హామీ ఇచ్చారని, ఇది దేశ రైతులను దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. లోక్‌సభలో మిగతా .. 2లో..

# భగ్గుమన్న చమురునాడి..

**భారతీయులున్న ట్యాంకర్‌పై ఇరాన్ దాడి..**



**విశ్వం వాయిస్ న్యూస్ :** అంతర్జాతీయ చమురు రవాణాకు జీవనాడి వంటి హర్మూజ్ జలసంధి ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మృతితో భగ్గుమంది. ఈ కీలక చమురు మార్గాన్ని మూసివేస్తున్నట్లు టెహ్రాన్ ప్రకటించిన కొన్ని గంటల్లోనే ఓ ట్యాంకర్‌ను లక్ష్యంగా చేసుకొని దాడి చేసింది. పలావు దేశ పతాకంతో వస్తున్న స్కైలైట్ చమురు ట్యాంకర్‌పై ఆదివారం ఒమన్‌లోని ముసాండమ్ ద్వీపకల్పం వద్ద ఖసాబ్ పోర్టు వద్ద ఇరాన్ దాడి చేసింది. ఆ సమయంలో నౌకలో మొత్తం 20 మంది సిబ్బంది ఉన్నారు. వీరిలో 15 మంది భారతీయులు.. మిగిలిన వారు ఇరాన్ జాతీయులు. ఈ దాడిలో నలుగురు గాయపడ్డారని ఒమన్ వెల్లడించింది.

**ఏమిటీ హర్మూజ్ జలసంధి..**

అరేబియా సముద్రంలో ఒమన్‌కు చెందిన మిగతా .. 2లో..



### న్యాయం కోసం కోర్టు తలుపులు తట్టే ప్రతి వ్యక్తికి న్యాయం లభిస్తుందన్న
# విశ్వాసం కల్పించాల్సిన భాధ్యత న్యాయమూర్తులదే

**భారత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్**

**తిరుపతి, విశ్వం వాయిస్ న్యూస్ :** న్యాయ సేవల కోసం కోర్టు తలుపులు తట్టే వేలాది మందికి న్యాయం లభిస్తుందన్న విశ్వాసం కల్పించాల్సిన భాధ్యత న్యాయమూర్తులందరిపై ఉందని భారత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. ఆదివారం తిరుపతి రూరల్ మండలం దామినేడు వద్ద భారత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, భారత సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జె.కె.మహేశ్వరి, జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎస్.వి.ఎన్. భట్టి, జస్టిస్ జాయ్ మాల్య బాగ్చీలతో కలసి 16 కోర్టు భవనాల నూతన కోర్టు సముదాయ భూమి పూజ మరియు శిలాఫలకాన్ని మిగతా .. 2లో..

# టెక్సాస్‌లో కాల్పులు.. ముగ్గురి మృతి

**విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో కాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందారు. మరో 14 మంది గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆస్టిన్‌లోని ఓ బార్‌లో కాల్పులు జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్నారు. ఓ సాయుధుడిని అదుపులోకి తీసుకునే క్రమంలో ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయి. దీంతో నిందితుడు మృతి చెందాడు. కాల్పుల మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి ఆనం

మద్దతు ధర ప్రకటించింది. ధాన్యం అమ్మిన 24గంటల్లోనే, నేరుగా వారి అకౌంట్లలో డబ్బు జమ అవుతోంది. దళారులు అత్యధిక ధరలు ఇస్తామంటే నమ్మి మోసపోవద్దు" అని ఆనం చెప్పారు.

## తప్పుడు ప్రచారం చేస్తున్న వారిని వదిలిపెట్టను

ఆ వీడియోలో తప్పు, అసభ్యత ఏముంది? ఆ వీడియోలో ఉన్నవారు నా కుటుంబ స్నేహితులు. 30 ఏళ్లుగా వారితో పరిచయం ఉంది. వీడియోలో కొంత భాగం మార్ఫింగ్ చేశారు. తప్పుడు ప్రచారం చేస్తున్న వారిని తేలిగ్గా వదిలిపెట్టే ప్రసక్తే లేదు. ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేశాను."అని బీఆర్ నాయుడు తెలిపారు.

## గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్తత..

యోగక్షేమాల గురించి అడిగి తెలుసుకున్నారు. బహ్రెయిన్‌లో ఉన్న తెలుగువారంతా అప్రమత్తంగా ఉండాలని, స్థానిక ప్రభుత్వ సూచనలు తప్పనిసరిగా పాటిస్తూ సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకోవాలని అయ్యన్నపాత్రుడు సూచించారు. ఎటువంటి ఆపద వచ్చినా ఏపీఎన్ఆర్టీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ సహాయం అందించేందుకు సిద్ధంగా ఉందని భరోసా కల్పించారు. అవసరమైతే అక్కడి తెలుగువారిని సురక్షితంగా స్వదేశానికి తీసుకురావడానికి కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో మాట్లాడి తక్షణ సహాయక చర్యలు చేపడతామన్నారు.

## హెచ్‌పీవీ వ్యాక్సినేషన్

'గార్డాసిల్-4' అనే టీకాను ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఈ వ్యాక్సిన్ హెచ్‌పీవీ టైప్ 16, 18తో పాటు టైప్ 6, 11 రకాల నుంచి రక్షణ కల్పించనున్నట్లు కేంద్రం తెలిపింది.

**'కాంగ్రెస్ ఇప్పుడు 'ముస్లింలీగ్- మావోయిస్టు కాంగ్రెస్'గా మారింది'**

అజ్మేర్‌లో కాంగ్రెస్‌పై మోదీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్(ఐఎన్‌సీ) ఇప్పుడు ముస్లిం లీగ్-మావోయిస్టు కాంగ్రెస్‌గా మారిందని విమర్శించారు. ముస్లిం లీగ్‌కు భారత్‌పై ఉన్న ద్వేషమే నాడు విభజనకు కారణమైందని, ఇప్పుడు కాంగ్రెస్ కూడా అదే విధంగా వ్యవహరిస్తోందన్నారు. ఏఐ సదస్సులో కాంగ్రెస్ యువజన విభాగం చేసిన అర్ధనగ్న నిరసనపై మాట్లాడుతూ..ఈ వ్యాఖ్యలు చేశారు. దేశాన్ని కించపరచడానికి దొరికిన ఏ అవకాశాన్నీ కాంగ్రెస్ వదులుకోదని మండిపడ్డారు. ప్రపంచం భారత్‌ని ప్రశంసించినప్పుడు, భారతీయులంతా గర్వపడితే.. కాంగ్రెస్ మాత్రం దేశాన్ని కించపరిచే ప్రయత్నాలు చేస్తుంటుందన్నారు. దేశవ్యాప్త ఎన్నికల్లో కాంగ్రెస్ వరుసగా ఓడిపోతూ వస్తోందని, అందుకే దేశాన్ని దిగజార్చే ప్రయత్నాలు చేస్తూ ప్రతీకారం తీర్చుకుంటోందని మోదీ అన్నారు.

## అండగా కూటమి ప్రభుత్వం

చెక్కులను కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, కాకినాడ జనసేన పార్టీ ఇంచార్జి మరియు డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి బాబులతో కలిసి అందించారు. గాలిలో కలిసిన ప్రాణాలు, గుండె కోత మిగిల్చిన విషాదంతో ఆ కుటుంబాల కళ్లల్లో గూడుకట్టుకున్న శోకాన్ని చూసి మంత్రి కందుల దుర్గేష్ కన్నీటి పర్యంతమయ్యారు. ఈ సందర్భంగా ప్రమాదంలో మరణించిన సామర్లకోటకు చెందిన దర్శిపాటి నాని(38), ఏడిద సంపత్ కుమార్(25), జి.మేడపాడు గ్రామానికి చెందిన గంపల మంగ(43), గంపల నాగరాజు(45), గూడపర్తికి చెందిన మందపల్లి చిన్ని(44), గొడత మహేష్(41), గొడత వీరవెంకట రమణ(48), కడింపల్లి ధనరాజు(55), పెదబ్రహ్మదేవం కి చెందిన మకర రాఘవమ్మ(55) ల కుటుంబసభ్యులకు ఒక్కొక్కరికి 20 లక్షల రూపాయల చొప్పున ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సహాయ చెక్కులను అందించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ వారి గ్రామంలో సభ్యుల ఇంటికి వెళ్లి పరామర్శించి ప్రభుత్వం తరపున అండగా ఉంటామన్న భరోసా కల్పించారు. వారిని ఆప్యాయంగా దగ్గరకు తీసి ఓదార్చారు. పోయిన మనుషులను వెనక్కి తీసుకురాలేం కానీ ఆ కుటుంబాలు రోడ్డున పడకూడదన్నదే ప్రభుత్వ ఉద్దేశమని చెబుతూ వారి తరపున కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకుంటామని, మీ ఇంట్లో ఒక బిడ్డగా, మీ అన్నదమ్ముడిగా తానున్నాను.. తమ ప్రభుత్వం మీకు అండగా ఉంటుందని బరువెక్కిన గుండెతో మంత్రి కందుల దుర్గేష్ చెక్కులు పంపిణీ చేయడం పలువురిని కంటతడి పెట్టించింది.. కేవలం చెక్కులు ఇచ్చి వెళ్లడం కాకుండా, ప్రతి ఇంటి లోపలికి వెళ్లి వారి కష్టసుఖాలను మంత్రి దుర్గేష్ అడిగి తెలుసుకున్నారు.ప్రమాదానికి గల కారణాలను విచారించి, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు ఈ పర్యటనలో స్థానిక నాయకులు, ప్రభుత్వ అధికారులు, కూటమి కార్యకర్తలు పాల్గొని బాధితులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

అంగన్వాడీలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడానికి కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని మంత్రి స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్వాడీ కేంద్రాల మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాల్లో తాగునీటి సౌకర్యాలు, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.86.68 లక్షలు విడుదల చేసి, ఒక్కో కేంద్రానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించినట్లు వెల్లడించారు. అంగన్వాడీలకు ప్రతి నెల ఒకటో తేదీననే వేతనాలు అందేలా చర్యలు తీసుకుని, జీతాల ఆలస్యానికి శాశ్వతంగా చెక్ పెట్టామని మంత్రి చెప్పారు. రాష్ట్రంలో 58,204 మంది అంగన్వాడీ వర్కర్లు, సూపర్‌వైజర్లు, బ్లాక్ కోఆర్డినేటర్లకు రూ.75 కోట్ల వ్యయంతో 5+ స్మార్ట్‌ఫోన్లు అందజేసినట్లు తెలిపారు. ఈ స్మార్ట్‌ఫోన్ల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు మరింత వేగంగా, సమర్థవంతంగా సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు. కూటమి పాలనలో అంగన్వాడీ కేంద్రాల హాజరు శాతం 70 నుండి 96 శాతానికి పెరిగిందని ఆమె తెలిపారు. ఏళ్ల తరబడి అంగన్వాడీలు ఎదురుచూసిన గ్రాట్యుటీ సమస్యను కూడా ప్రభుత్వం పరిష్కరించిందని, 2025 ఆంధ్రప్రదేశ్ బడ్జెట్‌లో రూ.20 కోట్లు కేటాయించి, అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లోనే గ్రాట్యుటీ చెల్లింపులకు చర్యలు ప్రారంభించినట్లు వెల్లడించారు. అంగన్వాడీ కేంద్రాలకు టీవీలు, ఆర్వో యంత్రాలు, టాయిలెట్ సౌకర్యాలు కల్పించడంతో పాటు టీచర్లు, ఆయాలకు వేసవిలో 15 రోజుల సెలవులు మంజూరు చేసినట్లు చెప్పారు. చిన్నారుల అభివృద్ధికి ఆటవస్తువులు, పాఠ్య చార్టులు, ఇండక్షన్ స్టవ్‌లు, నాణ్యమైన వంట పాత్రలు అందజేసినట్లు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 5,000 మినీ అంగన్వాడీ కేంద్రాలను పూర్తి స్థాయి కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేస్తున్నామని, మినీ అంగన్వాడీ కార్యకర్తలకు టీచర్‌గా పదోన్నతి కల్పించి పూర్తి స్థాయి వేతనాలు అందించనున్నట్లు తెలిపారు. అదనంగా 5,000 మంది అంగన్వాడీ సహాయకులను నియమించనున్నట్లు చెప్పారు. అంగన్వాడీలు ప్రతిపాదించిన 9 డిమాండ్లను ఇప్పటికే పరిష్కరించామని, వేతనాల పెంపు అంశాన్ని కూడా సాధ్యమైనంత త్వరగా అమలు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ ఉద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక రంగాన్ని దెబ్బతీసి వెళ్లిందని ఆరోపించిన మంత్రి, వారు చేసిన అప్పులకు రాష్ట్రానికి వస్తున్న ఆదాయంతో పాటు మరిన్ని అప్పులు తెచ్చి వడ్డీలు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొన్నదని విమర్శించారు. అయినప్పటికీ ప్రతి నెల ఒకటో తేదీననే వేతనాలు చెల్లిస్తూ ఉద్యోగులకు భరోసాగా నిలుస్తున్నది కూటమి ప్రభుత్వమేనని హోంమంత్రి అనిత తెలిపారు.

## ఉద్యమి సభ్యత్వ నమోదు

ఓ కళ్యాణ మండపంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా జనసేన పిఏసి ఛైర్మన్ నాదేండ్ల మనోహర్ హాజరైయ్యారు. సుమారు రెండున్నర గంటల పాటు జరిగిన సమావేశం ఆద్యాంతం ఉత్సాహాభరితంగా సాగింది. సమావేశాన్ని ఉద్దేశించి మొదట మాట్లాడిన పిఓసి లు, నియోజకవర్గ ఇన్చార్జీలు తాము ఖచ్చితంగా గతం కన్నా ప్రస్తుత ఉద్యమి క్రీయాశీలక సభ్యత్వాన్ని పెంచుతామని సమావేశ వేదిక సాక్షిగా ప్రకటించారు. గత ఐదేళ్ళ పాలనలో తాము ఎన్ని ఇబ్బందులు పడ్డా పవన్ కళ్యాణ్ కోసం నిలబడ్డామని ఖచ్చితంగా పార్టీ బలోపేతం కోసం సభ్యత్వ నమోదును ఇంటింటికి తీసుకెళ్ళి పెంచుతామని వారు స్పష్టం చేశారు. వీరి ప్రసంగానికి సమావేశం కరతాళధ్వనులతో హర్షం వ్యక్తం చేసింది. సాధక్ లు ఇంకా ఉద్యమి క్రీయాశీలక సభ్యత్వ నమోదులో పూర్తిగా నిమగ్నం కాలేదని జనసేన పిఏసి ఛైర్మన్ నాదేండ్ల మనోహనర్ అన్నారు. పార్టీ నాయకత్వంలో కానీ, నామినేటెడ్ పదువుల్లో క్రీయాశీలక సభ్యత్వం ఎంతో కీలకమని ఆయన తెలిపారు. రాజకీయ భవిష్యత్ అంతా యువతదేనని ఆయన అంటూ ఉద్యమి క్రీయాశీలక సభ్యత్వంలో యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సాధక్ లను కోరారు. క్షేత్రస్థాయి నుంచి రాష్ట్రస్థాయికి ఎదిగేందుకు ఉద్యమిని ఒక ఆయుధంగా ఉపయోగించుకోవాలని ఆయన చెప్పారు. నాయకత్వం అనేది క్షేత్రస్థాయిలో ఎన్ని ఇబ్బందులు వచ్చినా తట్టుకుని నిలబడితే దానంతట అదే వస్తుందని ఆయన తెలిపారు. సభ్యత్వ నమోదులో టార్గెట్ పేరిట గ్రూపులు కట్టకూడదని ఆయన కోరారు. పార్టీలో పవన్ కళ్యాణ్ ఒక్కరే బాస్ అని ఆయన చెప్పారు. పార్టీలో భిన్నాభిప్రాయలు ఉన్నా సోషల్ మీడియాకు ఎక్కరాదని ఆయన విజ్ఞప్తి చేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థలను నాశసనం చేసిందని ఆయన ఆరోపించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఆరునెలలకే తిరుపతి వేదికగా మాతృభాషపై పవన్ కళ్యాణ్ గొంతెత్తారని ఆయన తెలిపారు. అలాగే 2019 డిసంబర్ లో టిటిడిలో అక్రమాలపై తిరుపతి వేదికగా పవన్ కళ్యాణ్ ప్రభుత్వాన్ని నిలదీశారని ఆయన చెప్పారు. 2019 లోనే రాష్ట్ర అభివృద్ధికి బిజేపి అవసరమని పవన్ కళ్యాణ్ ప్రకటన చేయడం ఆయన ముందుచూపుకు ఉదాహరణ అని ఆయన చెప్పారు. అభివృద్ధి పేరుతో వైఎస్సార్ కాంగ్రెస్ నాయకులు రాష్ట్రాన్ని దోచుకున్నారని ఆయన ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో జనసేన నాయకులు, వీరమహిళలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆయన తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకలు వీరమహిళల వ్యక్తిత్వహననాకి సైతం పాల్పడ్డారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ఎంతో నమ్మకంతో ఎన్డీఏ కూటమికి ఊహించని మెజార్టీ కట్టబెట్టారని ఆయన తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరు బాధ్యతగా పని చేయాలని ఆయన కోరారు. పవన్ కళ్యాణ్ నాయకత్వం రాష్ట్రానికి ఎంతో అవసరం ఉందని ఆయన చెప్పారు. జనసేన ప్రజా ప్రతినిధులు టిడిపి, బిజేపి మద్దతుతో గెలిచాం అని టిడిపి, బిజేపి కూడా జనసేన మద్ధతుతో గెలిచాం అని ప్రజలకు తెలపాలని ఆయన కోరారు. కూటమి పార్టీలు ఒకరినొకరు గౌరవించుకుంటూ ప్రజా సేవలో ముందుండానలని ఆయన చెప్పారు. కాగా ఉద్యమి క్రీయాశీలక సభ్యత్వ నమోదులో తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గాన్ని మొదటి స్థానంలో నిలుపేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఉద్యమి క్రీయాశీలక సభ్యత్వం నమోదులో ఒక యజ్ఞనంలా సాధక్ లు చేయాలని ఆయన కోరారు. 2024వ సంవత్సరంలో కన్నా భారీగీ ఈసారి సభ్యత్వ నమోదు చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు. ఉద్యమి సభ్యత్వంతో ఐదు లక్షల ప్రమాద భీమా కార్యకర్త కుటుంభానికి భరోసా ఇస్తుందని ఆయన చెప్పారు. పార్టీ నాయకత్వంలో, నామినేటెడ్ పదువుల్లో క్రీయాశీలక సభ్యత్వం ఉంటేనే ఇకపై దక్కుతాయని ఆయన తెలిపారు. యువత, పార్టీ సానుభూతిపరులు, తటస్థులను ఆకర్షించి సభ్యత్వ నమోదును పెంచాలని ఆయన జన శ్రేణులను కోరారు. క్రియాశీలక సభ్యులకు పార్టీ అన్ని విధాల అండగా ఉంటుందని ఆయన చెప్పారు. కాగా మంత్రి నాదేండ్ల మనోహర్ ను సన్మానించేందుకు నాయకులు పెద్ద ఎత్తున పోటీ పడ్డారు. సమావేశ ప్రారంభంలోనే మంత్రిని సన్మానించేందుకు నాయకులు ప్రయత్నించగా చివర్లో చూద్దాం అంటూ నాయకులను నాదేండ్ల మనోహర్ కోరారు. దీంతో సమావేశం ముగిసిన వెంటనే నాయకులు, వీరమహిళలు నాదేండ్ల మనోహర్ ను సత్కరించి ఫోటోలు దిగారు. దీంతో మధ్యాహ్న భోజనం ఆలస్యంగా చేయాల్సి పరిస్థితి నాదేండ్ల మనోహర్ కు ఎదురైయ్యింది. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన అధ్యక్షులు, ఏపి హస్తకళల అభివృద్ధి కార్పోరేషన్ ఛైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్చార్జి, శ్రీకాళహస్తి దేవస్థానం పాలకమండలి ఛైర్మన్ కొట్టే సాయి ప్రసాద్, సర్వేపల్లి నియోజకవర్గ పిఓసి సురేష్ నాయుడు, గూడురు నియోజకవర్గ పిఓసి మోహన్, సూళ్ళూరుపేట నియోజకవర్గ పిఓసి ప్రవీణ్, సత్యవేడు నియోజకవర్గ పిఓసి లావణ్య కుమార్, వెంకటగిరి నియోజకవర్గ ఇన్చార్జీ తోట కృష్ణయ్య, కీర్తన, ఆకుల వనజ తదితరలు పాల్గొన్నారు.

## వాణిజ్య ఒప్పందం రైతులకు ముప్పు

ఆర్మీ మాజీ చీఫ్ మనోజ్ నరవణే పుస్తకం గురించి మాట్లాడాలని అనుకున్నానని, కానీ, అవకాశం ఇవ్వలేదని రాహుల్ తెలిపారు. అలాగే పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో అక్కడి భారతీయుల భద్రతకు సంబంధించి కేంద్రం వెంటనే ముందస్తు చర్యలు తీసుకోవాలని రాహుల్ 'ఎక్స్' వేదికగా కోరారు. మాజీ సైనికుల సహకార ఆరోగ్య పథకం (ఈసీహెచ్ఎస్)కు నిధులు కేటాయించడంతో పాటు వికలాంగుల పెన్షన్లపై పూర్తి ఆదాయపు పన్ను మినహాయింపును పునరుద్ధరించాలని కోరుతూ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాసినట్లు రాహుల్ తెలిపారు.

## భగ్గుమన్న చమురునాడి..

ముసాండం ద్వీపకల్పం-ఇరాన్ మధ్య ఉన్న అత్యంత ఇరుకైన జలసంధి ఇది. దీనిలో ఓ చోట అత్యంత ఇరుకుగా కేవలం 33 కిలోమీటర్లు మాత్రమే ఉంటుంది. ఇరు దేశాలు ఇందులో అత్యధిక భాగం తమదే అని చెబుతున్నాయి. రెండు షిప్పింగ్ లేన్లు ఉన్నాయి.ఇందులో క్రూడ్ క్యారియర్లు సులువుగా ప్రయాణించగలుగుతాయి. ఈ మార్గం నుంచి నిత్యం 2 కోట్ల పీపాల చమురు వివిధ దేశాలకు వెళుతుంది. ఇది మొత్తం ప్రపంచం వినియోగించే దానిలో ఐదో వంతుకు సమానం. సౌదీ, ఇరాన్, యూఏఈ, కువైట్, ఇరాక్‌ల నుంచి ఎగుమతి అవుతోంది. ఇక లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ రవాణాకు కూడా అత్యంత కీలకం. మూడింట ఒక వంతు ఎల్ఎన్‌జీ కూడా ఇక్కడి నుంచే వివిధ దేశాలకు చేరుతుంది.

**భారత్‌పై తీవ్ర ప్రభావం**

మన దేశం దిగుమతి చేసుకొనే ఎల్ఎన్‌జీలో సగానికిపైగా ఈ మార్గం నుంచే రావాల్సి ఉంటుంది. హర్మూజ్ మీదుగానే రావాల్సి ఉంది. ఇక రోజువారీ 55లక్షల పీపాల చమురును భారత్ ఈ మార్గం నుంచి దిగుమతి చేసుకొంటోంది. ఇది భారత చమురు అవసరాల్లో 40%శాతానికి సమానం. గత రెండు నెలల్లో ఇది 50% శాతానికి చేరింది. హర్మూజ్‌లో ఇబ్బందులు ప్రపంచ చమురు మార్కెట్లను తీవ్రంగా ప్రభావితం చేయనున్నాయి.

**గతంలోనూ ట్యాంకర్లపై దాడులు**

1980-88 వరకు జరిగిన ఇరాన్-ఇరాక్ యుద్ధం ప్రభావం జలసంధిపై పడింది. నాడు ఇరు దేశాలు పరస్పర ఎగుమతులను దెబ్బతీసేందుకు.. ట్యాంకర్లపై దాడులు చేసుకొన్నాయి. దీనిని ట్యాంకర్ వార్ అని కూడా అంటారు. ఆ సమయంలో వివిధ దేశాల పతాకాలపై ప్రయాణించిన దాదాపు 450కు పైగా నౌకలపై ఇరు దేశాలు దాడులు చేశాయి.

## టెక్సాస్‌లో కాల్పులు.. ముగ్గురి మృతి

ఘటనలో ముగ్గురు పౌరులు మృతి చెందారని, 14 మంది గాయపడ్డారని పోలీసులు తెలిపారు. క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నామని చెప్పారు. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని వెల్లడించారు.

## 36 జడ్జీల బంగ్లాలు నిర్మాణం

జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ ఎస్‌వీఎస్ భట్టి, జస్టిస్ జాయ్ మాల్యా బాగ్చి, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు శ్యామల రావు, సురేష్ కుమార్, సిఆర్‌డిఏ కమిషనర్ కన్నబాబు, గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్.పి. వకుల్ జిందాల్ పాల్గొన్నారు. ప్రారంభోత్సవం అనంతరం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు, ఇతర న్యాయమూర్తులతో కలిసి ఒక నివాస గృహాన్ని సందర్శించారు.

## విశ్వాసం కల్పించాల్సిన భాద్యత న్యాయమూర్తులదే

ఆవిష్కరణ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తి మరియు జిల్లా పరిపాలనా న్యాయమూర్తి శ్రీ జస్టిస్ నినాల జయసూర్య, ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తి జస్టిస్ డొనాది రమేష్, ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తి జస్టిస్ మహేశ్వరరావు కుంచం, ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తి జస్టిస్ టి.సి.డి. శేఖర్, డిఐజీ షిమోజి బాయ్, చిత్తూరు జిల్లా ఉమ్మడి డిస్ట్రిక్ట్ ప్రిన్సిపల్ జడ్జి అరుణ సారిక, అడిషనల్ జిల్లా జడ్జి గురునాథం, తిరుపతి బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జి.గజేంద్ర, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్షి, అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి, తిరుపతి ఆర్టీవో రామ్మోహన్ ,బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయాధికారులు, న్యాయవాదులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ కోర్టు సముదాయాలు ఆసుపత్రుల్లా పనిచేయాలని నేను ఎప్పటి నుంచో చెబుతున్నాని, ఆసుపత్రికి వెళ్లిన రోగికి మొదట ప్రాథమిక చికిత్స అందించినట్లే, కోర్టుకు వచ్చే ప్రతి వ్యక్తికి కూడా భద్రత మరియు న్యాయం లభిస్తుందనే నమ్మకం కలగాలన్నారు. ఈ బాధ్యత బార్ మరియు బెంచ్ రెండింటి పై సమానంగా ఉంటుందన్నారు. ఈ కొత్త న్యాయస్థాన సముదాయం కూడా "న్యాయ దేవాలయం"గా మారాలని నేను కోరుకుంటున్నానని, ఇక్కడికి వచ్చే ప్రతి వ్యక్తి న్యాయం పొందిన ఆనందంతో వెళ్లాలన్నారు. తిరుపతి బార్‌కు ఉన్న మేధస్సు, చారిత్రాత్మక వారసత్వం, మేధో సంపత్తి తో మరింత వికసించాలని ఆకాంక్షించారు. న్యాయ వ్యవస్థలో బార్ అసోసియేషన్ ఒక అవిభాజ్య భాగమని, న్యాయం అందించడం కేవలం బెంచ్ బాధ్యత మాత్రమే అనే భావన ఒక అపోహన్నారు. ముఖ్యంగా గర్వించదగిన సంప్రదాయం కలిగిన తిరుపతి బార్ అసోసియేషన్ వారికి ప్రత్యేకంగా చెబుతున్నానన్నారు. బార్ మరియు బెంచ్ ప్రత్యర్థులు కావని, అవి ఒకే సంస్థకు చెందిన రెండు చేతులన్నారు. బలమైన బార్ అసోసియేషన్ మంచి వాదనలను అందిస్తుందని, మంచి వాదన న్యాయమూర్తులను మరింత లోతుగా ఆలోచించడానికి, జాగ్రత్తగా విశ్లేషించడానికి, స్పష్టంగా తీర్పులు రాయడానికి ప్రేరేపిస్తుందన్నారు. బార్ అసోసియేషన్ అందించే సహకారం ఎంత నాణ్యమైనదైతే, న్యాయమూర్తి పనితీరు కూడా అంతే మెరుగ్గా ప్రతిఫలిస్తుందన్నారు. మీరు ఎంత బాగా వాదిస్తే, తీర్పుల నాణ్యత అంత మెరుగ్గా ఉంటుందన్నారు. మంచి కారణాలతో ఇచ్చిన తీర్పులు ప్రజల్లో న్యాయవ్యవస్థపై విశ్వాసాన్ని పెంచుతాయని, త్వరలో నిర్మించబడనున్న ఈ కొత్త కోర్టు సముదాయం న్యాయవాదులకు తగిన పని వాతావరణాన్ని కల్పిస్తుందన్నారు. జస్టిస్ ఎ.కె. మహేశ్వరి న్యాయ మౌలిక సదుపాయాల ప్రాముఖ్యత, విలువ మరియు అవసరాన్ని వివరించారన్నారు. కోర్టు భవన నిర్మాణం పూర్తయ్యాక కేవలం రాళ్లు, గోడలు లేదా భవనం మాత్రమే ముఖ్యమైనవి కావని, నా దృష్టిలో, భవనం నిర్మాణం పూర్తై, ఆధునిక మౌలిక సదుపాయాలు, సాంకేతిక పరికరాలు ఏర్పడి, బార్ సభ్యులు, న్యాయవ్యవస్థ, సిబ్బంది అందరూ సాంకేతికతో సిద్ధంగా ఉన్నప్పుడు సవాళ్ళు ప్రారంభం అవుతాయన్నారు. ఇందులో అందుబాటులో ఉండే ఖర్చుతో న్యాయాన్ని ప్రజలకు చేరవేయడం ఒకటైతే నిర్దిష్ట కాలపట్టికతో, ముందుగా ఊహించగలిగే విధంగా న్యాయ నిర్ణయ వ్యవస్థను అమలు చేయడం రెండవ సవాలు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు భవిష్యత్తు 50-100 సంవత్సరాల అవసరాలను దృష్టిలో పెట్టుకొని న్యాయ మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నానన్నారు. దేశం అభివృద్ధి చెందుతోందని, జనాభా పెరుగుతోందని, పట్టణీకరణ వేగంగా జరుగుతోందని, భవిష్యత్తులో న్యాయ మౌలిక సదుపాయాల కోసం పెద్ద భూభాగాలు లభించడం కష్టతరం కానున్న నేపథ్యంలో దూరదృష్టితో ఆలోచించి భూమిని కేటాయించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందిస్తున్నానన్నారు. ఈ కోర్టు సముదాయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ భవన సముదాయం సమయానికి పూర్తవుతుందని నాకు పూర్తి విశ్వాసం ఉందని, మళ్లీ తాను శ్రీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించడానికి వచ్చినప్పుడు, ఈ న్యాయ సముదాయం విజయవంతంగా పనిచేస్తుండడం చూసి గర్వపడతానన్నారు. ఆంధ్రప్రదేశ్ హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ పరిస్థితులు అత్యంత క్లిష్టంగా ఉన్న సమయంలో కూడా జస్టిస్ మిశ్రా, జస్టిస్ మహేశ్వరి లు ప్రధాన న్యాయమూర్తులుగా బాధ్యతలు నిర్వహించారు. "పరిస్థితులు కఠినంగా మారినప్పుడు ధైర్యవంతులు ముందుకు వస్తారు" అనే సామెతను వారు నిజం చేశారన్నారు. విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ మౌలిక సదుపాయాల అభివృద్ధికి బలమైన పునాది వేయడం వారి ప్రధాన బాధ్యతగా ఉండగా, వారు ఆ బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తించారన్నారు. సుప్రీంకోర్టు ఢిల్లీలో ఉన్నప్పటికీ, దేశవ్యాప్తంగా న్యాయ మౌలిక సదుపాయాల అభివృద్ధిపై చూపుతున్న శ్రద్ధ స్పష్టంగా కనిపిస్తోందని, దేశవ్యాప్తంగా కోర్టుల సమర్థవంతమైన నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నారన్నారు. ఇది పవిత్రక్షేత్రమైన నగరం అయినప్పటికీ, దేశవ్యాప్తంగా న్యాయవ్యవస్థ అభివృద్ధిపై కూడా వారు సమాన శ్రద్ధ చూపుతున్నారని, గతంలో న్యాయమూర్తులు చాలా క్లిష్ట పరిస్థితుల్లో పనిచేసిన విషయం మనందరికీ తెలుసని, అనేక కోర్టు భవనాల్లో సరైన సదుపాయాలు లేకపోయేవని, కొన్ని చోట్ల మరుగుదొడ్లు కూడా ఉండేవి కాదని, మహిళా న్యాయవాదుల కోసం ప్రత్యేక సదుపాయాలు ఉండేవి కాదన్నారు. కోర్టు గదులు, న్యాయమూర్తుల ఛాంబర్లు కూడా తగిన స్థాయిలో ఉండేవి కాదన్నారు. ఇతర ప్రభుత్వ కార్యాలయాలతో పోలిస్తే న్యాయవ్యవస్థ మౌలిక సదుపాయాలు అత్యంత వెనుకబడి ఉండేవన్నారు. ప్రభుత్వాధికారులకు అధికారిక వాహనాలు ఉండేవి. అలాంటి కష్టకాలాన్ని మనం చూసామని, కానీ కాలక్రమేణా పరిస్థితులు మెరుగుపడ్డాయన్నారు. ఒకప్పుడు "మౌలిక సదుపాయాలు లేకపోయినా న్యాయమూర్తి చెట్టు కింద కూర్చొని కూడా న్యాయం చేయగలడు" అని చెప్పేవారని, దానికి సంకల్పం ఉండాలన్నారు. 2014-15 సంవత్సరాల్లో కాశ్మీర్‌లో వరదలు సంభవించినప్పుడు మొత్తం నగరం నీటిలో మునిగిపోయింది. హైకోర్టు భవనం కూడా దాదాపు ఒకటిన్నర అంతస్తు వరకు నీటిలో మునిగిపోయిందని, రికార్డులు నాశనమయ్యాయని, అయినప్పటికీ ఒక న్యాయమూర్తి నివాసంలో తాత్కాలిక హైకోర్టు ఏర్పాటు చేసి, టెంట్ వేసి నగరం మునిగిపోయినా న్యాయం ఆగదు అనే సందేశాన్ని ఇచ్చారన్నారు. అదే న్యాయమూర్తుల ఆత్మస్ఫూర్తి అన్నారు. పెండింగ్ కేసుల సంఖ్య పెరగడంతో సాంకేతికతను స్వీకరించడం అత్యవసరమైందని, పాత భవనాల్లో ఆధునిక సాంకేతిక వ్యవస్థలను అమలు చేయడం సాధ్యం కాదని, స్థలం కొరత వల్ల పాత కోర్టుల్లో పనిచేయడం కష్టమైందని బార్ అధ్యక్షులు కూడా చెప్పారన్నారు. అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీ గురునాథ్ గారు తెలిపినట్లుగా, పాత కోర్టు భవనానికి వెళ్లే మార్గం కూడా ఇరుకుగా ఉండి పనితీరును ప్రభావితం చేస్తోందన్నారు. హైకోర్టు మరియు నివాసాల్లో మేము సౌకర్యంగా ఉండగా, జిల్లా న్యాయవ్యవస్థ క్లిష్ట పరిస్థితుల్లో పనిచేస్తుండటం చూసి వెంటనే ఒక ప్రణాళిక రూపొందించామని, దీనివల్ల న్యాయమూర్తులు, న్యాయవాదులు, వాదిదారులు అందరికీ సౌకర్యం పెరిగి పనితీరు మెరుగుపడిందన్నారు. మంచి మౌలిక సదుపాయాలు ఉంటే పనితీరు కూడా పెరుగుతుందన్నారు. జస్టిస్ జె.కె.మహేశ్వరి మాట్లాడుతూ తిరుమల కొండ కేవలం ఆధ్యాత్మికతకే కాదు, ధర్మానికి ప్రతీకని, న్యాయ సంప్రదాయంలో కోర్టును "న్యాయ దేవాలయం"గా పేర్కొంటామని, తిరుపతిలో దేవాలయం మరియు న్యాయస్థానం మధ్య ఉన్న భావన మరింత దగ్గరగా అనిపిస్తుందని, రెండింటి పునాది సత్యాన్వేషణ మరియు సమాజంలో సమతుల్యతను పునరుద్ధరించడమేనన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి, జిల్లా కలెక్టర్‌కి, పోలీస్ శాఖకు, జిల్లా పరిపాలనకు వారి సహకారానికి ధన్యవాదాలు. కార్యక్రమంలో పాల్గొన్న భారత ప్రధాన న్యాయమూర్తి, భారత సుప్రీం కోర్టు న్యాయమూర్తులు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు, న్యాయాధికారులు, జిల్లా యంత్రాంగం, న్యాయవాదులు తదితరులకు ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రినిసిపల్ జడ్జి శ్రీమతి అరుణ సారిక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా భారత ప్రధాన న్యాయమూర్తి, భారత సుప్రీం కోర్టు న్యాయమూర్తులు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులకు శాలువాలతో సత్కరించి పూలమాలలు వేసి శ్రీవారి ప్రతిమలను బహుకరించి సత్కరించారు.

# ఎడిటర్ వాయిస్

## తెలుగు నాడు.. టీడీపీ కూటమికి ఓకేనా?

ప్రతీ పథకానికి తెలుగు పేరు పెట్టారు, తెలుగు విశ్వ విద్యాలయాన్ని ఏర్పాటు చేశారు. అలాగే పాలనలో తెలుగుకు పెద్ద పీట వేశారు. ఆంధ్ర ప్రదేశ్ పేరు మార్పు అన్నది ఇపుడు అతి పెద్ద చర్చగా ముందుకు వస్తోంది. దీనికి కారణం పక్కన ఉన్న కేరళ పేరు కాస్తా కేరళంగా మార్పు జరగడం. కేరళం అన్నది మళయాళ భాషలో ఉన్న పేరు. అది భాషకు ఇచ్చిన గౌరవం. లెఫ్ట్ కూటమి నాయకత్వంలో ఉన్న ప్రభుత్వం తమ ప్రాంతీయతను భాషను గౌరవించుకుంటూ పేరు మార్చుకుంది. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం సైతం కేబినెట్‌లో ఆమోదం తెలిపింది. ఇక దక్షిణాదిన చూస్తే కర్ణాటక రాష్ట్రం పేరు కూడా ప్రాంతాన్ని భాషను తెలియచేస్తోంది. అలాగే తమిళనాడు తమ అస్తిత్వాన్ని రుజువు చేసుకుంటూ ఏనాడో పేరు మార్చుకుంది. కొత్తగా ఏర్పడిన తెలంగాణా కూడా తమ భాష నుడికారానికి ప్రాంతీయ మమకారానికి చిహ్నంగా నిలిచింది. మరి ఆంధ్ర ప్రదేశ్ మాత్రం ఉత్తరాది వాసనతో హిందీ పేరు మిశ్రమంతో ఉంది. దాని మీదనే అంతా చర్చిస్తున్నారు. భాషాభిమానుల నుంచి అంతా కూడా ఏపీ పేరు మార్చాల్సిందే అని డిమాండ్ చేస్తున్నారు.

ప్రపంచ తెలుగు సభల్లో : ఇదిలా ఉంటే అమలాపురం కోనసీమ జిల్లాలో జరుగుతున్న మూడవ ప్రపంచ తెలుగు మహా సభలలో అనేక మంది వక్తలు అయితే తెలుగు తనం మనకు ధనం అంటూ చెప్పుకొచ్చారు. మహా సహస్రావధాని గరికపాటి నరసింహారావు అయితే ఈ సభలలో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉత్తర ప్రదేశ్, మధ్య ప్రదేశ్ హిమాచల్ ప్రదేశ్ లా ఆంధ్ర ప్రదేశ్ ఏమిటి అని ఆయన అన్నారు. ఈ పేరులో తెలుగు లేదని ఆయన అంటూ పేరు మార్చాలని కోరారు అంతే కాదు తెలుగు నాడు అన్న పేరుని సూచించారు. పైగా దాని వెనక ఉన్న చరిత్రను కూడా చెప్పారు. ఎన్టీఆర్ సీఎం గా ఉన్నపుడు ఈ ప్రతిపాదన చేశారు అన్నారు. ఆ విధంగా తెలుగు నాడు పేరుని మార్చాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

ఎన్ టీఆర్ ప్రతిపాదన ఏమిటి : ఇదిలా ఉంటే 1983 నుంచి 1989 దాకా ఏడేళ్ళ పాటు తొలి దఫాలో పాలించిన ఎన్టీఆర్ ఎన్నో విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకున్నారు. ప్రతీ పథకానికి తెలుగు పేరు పెట్టారు, తెలుగు విశ్వ విద్యాలయాన్ని ఏర్పాటు చేశారు. అలాగే పాలనలో తెలుగుకు పెద్ద పీట వేశారు. అదే క్రమంలో ఆయన ఆంధ్ర ప్రదేశ్ పేరుని కూడా తెలుగునాడుగా మార్చాలని చూశారని చెబుతారు. ఆలోచనలు చేశారు అని చెబుతారు. ఆ విధంగా అయితే అప్పట్లో చర్చ జరిగింది అని అంటారు. కానీ కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉండడంతో అది ప్రతిపాదన దశలో మరీ ముఖ్యంగా ఆలోచన దశలోనే ఉండిపోయింది అని అంటారు. అ. పైగా ఎన్ టీఆర్ కాంగ్రెస్ వ్యతిరేక శిబిరంలో ప్రముఖ నాయకుడు. దాంతో ఆయన ప్రతిపాదన అలా ఆగిపోయింది అని గుర్తు చేసుకుంటున్నారు.

కూటమికి ఆమోదమేనా : ఏపీలో తెలుగుదేశం పార్టీ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఉంది. తెలుగుదేశం పార్టీ కనుక తలచుకుంటే ఆంధ్ర ప్రదేశ్ పేరు తెలుగు నాడుగా చాలా సులువుగా మారిపోతుంది. పైగా తెలుగు అస్థిత్వానికి ఎంతో విలువ గౌరవం ఇచ్చినట్లు అవుతుంది. ఇక తెలుగుదేశం పార్టీకి కూడా ఇది రాజకీయంగా మేలు చేసేదిగా ఉంటుంది అని అంటున్నారు. తెలుగు నాడు అంటే అందులో తెలుగుదేశం పార్టీ సౌండ్ కూడా ఎంతో బిగ్గరగా వినిపిస్తుంది. అలా బహుళ ప్రయోజనం కూడా సమకూరుతుంది అని అంటున్నారు. తెలుగు నాడు అని పేరు మార్చాలని కూటమి నిర్ణయం తీసుకుంటే అడ్డుకునే వారు కానీ అభ్యంతరం చెప్పే వారు కానీ ఎవరూ ఉండరని అంటున్నారు పైగా కేంద్రంలో ఎన్ డీయే ప్రభుత్వం ఉంది. వెంటనే ఈ ప్రతిపాదనకు ఆమోదముద్ర వేస్తుంది. మరి ఈ విషయంలో కూటమి ప్రభుత్వం ఏ విధంగా స్పందిస్తుంది అన్నది చూడాల్సి ఉంది అని అంటున్నారు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్



### మద్యానికి డబ్బు ఇవ్వలేదని...

## తల్లిని కడతేర్చిన తనయుడు



**కోటగిరి(రుద్రూర్), విశ్వం వాయిస్ న్యూస్ :** వృద్ధాప్యంలో ఉన్న కన్న తల్లిని కంటికి రెప్పలా కాపాడాల్సిన కుమారుడు... మద్యానికి డబ్బు ఇవ్వలేదనే కారణంతో కడతేర్చాడు. ఈ దారుణ ఘటన నిజామాబాద్ జిల్లా కోటగిరిలో శనివారం వెలుగుచూసింది. కోటగిరి ఎస్సై సునీల్, స్థానికులు తెలిపిన ప్రకారం... కోటగిరిలోని బ్రాహ్మణగల్లీకి చెందిన భూమవ్వ(70) భర్త గతంలోనే చనిపోయారు. ఆమెకు కుమారుడు మానాజీ(45), కుమార్తె మాదవ్వ ఉన్నారు. కుమార్తెకు వివాహమవగా, కుమారుడికి ఇంకా పెళ్లి కాలేదు. మానాజీ అప్పుడప్పుడు కూలీ పనులు చేసేవాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. మద్యం తాగేందుకు పింఛన్ డబ్బు ఇవ్వాలని, ఇల్లు కూడా అమ్మేద్దామని తరచూ భూమవ్వపై ఒత్తిడి తెచ్చేవాడు. ఇదే విషయమై శుక్రవారం రాత్రి 9.30 గంటలకు తల్లితో గొడవపడ్డాడు. ఈ క్రమంలో భూమవ్వను ఖాళీ మద్యం సీసా, రోకలితో తలపై కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. అదే గ్రామంలో ఉంటున్న కుమార్తె మాదవ్వ సమాచారం తెలుసుకుని ఇంటికి వచ్చి తల్లి మృతదేహాన్ని చూసి రోదించారు. అనంతరం తల్లి తల వద్ద దీపం వెలిగించారు. అర్ధరాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో మానాజీ తన తల్లి మృతదేహంపై దీపం నూనెను పోసి నిప్పంటించాడు. మంటలను గమనించిన స్థానికులు వచ్చి ఆర్పేశారు. శనివారం ఉదయం సమాచారం తెలుసుకున్న సీఐ కృష్ణ ఘటనా స్థలికి చేరుకొని శవ పంచనామా నిర్వహించారు. అనంతరం మానాజీని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## కానిస్టేబుల్‌ను బానెట్‌పై ఈడ్చుకెళ్లిన మందుబాబు..

### నిందితుడికి 14 రోజుల రిమాండ్



**గచ్చిబౌలి, విశ్వం వాయిస్ న్యూస్ :** గచ్చిబౌలిలో శనివారం ఉదయం ఓ విలాసవంతమైన బెంజ్ కారు బీభత్సం సృష్టించిన సంగతి తెలిసిందే. మితిమీరిన వేగంతో వెనుక నుంచి ఒక వాహనాన్ని ఢీకొట్టడమే కాకుండా, తనను అడ్డుకోబోయిన ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను బానెట్‌పై ఈడ్చుకెళ్లి ప్రాణాపాయం కలిగించిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ ఘటనపై గచ్చిబౌలి పోలీసులు రెండు వేర్వేరు కేసులు నమోదు చేసి నిందితుడు గుర్రంపాటి తరుణ్‌ను రిమాండ్‌కు తరలించగా.. కోర్టు అతనికి 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. నిందితుడిని సంగారెడ్డి జిల్లాలోని కంది జైలుకు తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలను పోలీసులు సేకరించారు.

**ప్రమాదం జరిగిందిలా..**

శనివారం ఉదయం కారులో నార్సింగి నుంచి కూకట్‌పల్లి వైపు వెళ్తుండగా, నానక్‌రామ్‌గూడ వద్ద తెల్లటి బెంజ్ కారు అతివేగంగా వచ్చి వెనుక నుంచి ఢీకొట్టిందని.. శనివారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో రాహుల్ అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ప్రమాదంలో తాను కారు నియంత్రణ కోల్పోయి డివైడర్‌ను ఢీకొనగా, నిందితుడు కారు ఆపకుండా గచ్చిబౌలి వైపు పరారైనట్లు చెప్పారు. నానక్‌రామ్‌గూడ ప్రమాదంపై సమాచారం అందుకున్న గచ్చిబౌలి IIIT జంక్షన్ వద్ద విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ నర్సింహులు, ఆ బెంజ్ కారును ఆపే ప్రయత్నం చేశారు. మొదట వేగం తగ్గించిన డ్రైవర్, అకస్మాత్తుగా వేగం పెంచి కానిస్టేబుల్ వైపు దూసుకెళ్లాడు. దీంతో ప్రాణరక్షణ కోసం నర్సింహులు కారు బానెట్‌పై పడిపోయారు. కానిస్టేబుల్ బానెట్‌పై ఉన్నాడని తెలిసి కూడా నిందితుడు వాహనాన్ని అతి వేగంగా నడుపుతూ ఆయన ప్రాణాలకు ముప్పు కలిగించాడు. చివరకు ఇతర వాహనదారులు అడ్డుకోవడంతో కారు ఆగింది.

**మద్యం మత్తులో విద్యార్థి**

పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని డ్రంకెన్ డ్రైవింగ్ పరీక్ష నిర్వహించగా, రక్తంలో ఆల్కహాల్ శాతం 160 mg/100 ml గా నమోదైంది. ఇది అనుమతించిన పరిమితి కంటే చాలా ఎక్కువ. నిందితుడిని నార్సింగికి చెందిన 24 ఏళ్ల విద్యార్థి గుర్రంపాటి తరుణ్‌గా గుర్తించారు.

### చనిపోతావని జ్యోతిష్కుడు చెప్పడంతో

## ఉరేసుకున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని

### బెంగళూరులో దారుణం

### ఆత్మహత్యకు పాల్పడిన విద్యాజ్యోతి



**బెంగళూరు (యశ్వంతపురం), విశ్వం వాయిస్ న్యూస్ :** ఆమె ఓ మంచి సంస్థలో సాఫ్ట్‌వేర్ ఉద్యో గిని. కొడగు ప్రాంతానికి చెందిన ప్రేమించిన యువకుడితో తొమ్మిది రోజుల కిందటే వివాహం జరి గింది. అయితే ఓ జ్యోతిష్కుడు వెల్ల డించిన అంశాలతో తీవ్రంగా భయపడిన ఆమె చివరకు ప్రాణాలు తీసుకుంది. బెంగళూరు బాగలకుంటె ఎంఈఐ లేఔట్‌కు చెందిన విద్యాజ్యోతి (29) శుక్రవారం రాత్రి ఆత్మహత్య చేసుకుంది. "నువ్వు ఎక్కువ కాలం భూమ్మీద మనుగడ సాగించలేవు. త్వరలోనే నూకలు చెల్లుతాయి" అని వర్క్ ఫ్రం హోంలో ఉన్న ఆమెకు ఓ జ్యోతిష్కుడు చెప్పాడు. అక్కడితో ఆగకుండా.. "ఈ తొమ్మిది రోజులూ పూజలు చేయి. ఆఖరి రోజైన.. శుక్రవారం నీ తాళి తీసి అమ్మవారికి సమర్పించు. ఆపై నీకు మంచి జరుగుతుంది" అని తెలి పాడు. ఆయన మాటలకు విపరీతంగా భయపడిపోయిన ఆమె అలానే పూజలు చేసి.. తొమ్మిదో రోజు అమ్మవారికి తాళి తీసివ్వడానికి ముందు గదిలోకి వెళ్లింది. అనంతరం తలుపులు వేసుకుని ఫ్యాన్‌కు ఉరేసుకుంది.

## ఆర్టీసీ బస్సు - కారు ఢీ.. ముగ్గురు దుర్మరణం



**కళ్యాణదుర్గం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆర్టీసీ బస్సు, కారు ఢీ కొన్న ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని గువనపల్లి గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. ముదిగలకు చెందిన చెల్లెలు చంద్రకళ (32), తన సోదరులు శివకుమార్ (36), హనుమంత రాయుడు (40) కారులోనే ఇరుక్కుపోయి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. అనంతపురం నుంచి రాయదుర్గానికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు వీరు ప్రయాణిస్తున్న కారును ఢీ కొట్టింది. కర్ణాటకలోని మొలకల్మూర్‌లో జరిగే వివాహానికి వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. డీఎస్పీ రవిబాబు, సీఐ హరినాథ్ తమ సిబ్బందితో సంఘటన స్థలికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కలంద్రం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## పసిగుడ్డును నీటితొట్టెలో వేసి హత్య

### పోలీసుల అదుపులో తండ్రి

**బిజినేపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం పాలెంలో దారుణం చోటుచేసుకొంది. మూడు నెలల పసిగుడ్డును నీటి తొట్టెలో వేసి హత్య చేసిన ఘటన శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం... పాలెం గ్రామానికి చెందిన నాగయ్య, నర్సమ్మల కుమార్తె నీలమ్మను ఏడేళ్ల క్రితం వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం షాగాపూర్‌కు చెందిన నరేందర్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. వారికి ఇద్దరు సంతానం. మూడేళ్లుగా దంపతుల మధ్య ఏర్పడిన విభేదాల కారణంగా నీలమ్మ తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. భర్త నరేందర్ అప్పుడప్పుడు భార్య వద్దకు వస్తుండేవాడు. ఇదే క్రమంలో నీలమ్మ మూడోసారి గర్భం దాల్చి రెండు నెలల కిందట మగబిడ్డకు జన్మనిచ్చారు. కాగా, శుక్రవారం సాయంత్రం నరేందర్ గ్రామానికి వచ్చి భార్యను తన వెంట పంపించాలని కుటుంబసభ్యులతో గొడవపడ్డాడు. అందుకు నీలమ్మ తల్లిదండ్రులు ఒప్పుకోకపోవడంతో అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అదేరోజు రాత్రి నీలమ్మ చిన్నారితో కలిసి ఇంట్లో నిద్రించారు. రాత్రి ఒంటి గంట ప్రాంతంలో తల్లికి మెలకువ వచ్చి చూడగా... బాలుడు కన్పించలేదు. ఇంటి ఆవరణలో చిన్నారి కోసం వెతుకుతుండగా.. నీటితొట్టెలో మృతదేహం కనిపించింది. బాలుడిని హతమార్చింది తన భర్త నరేందరేనని, బిడ్డ తనకు పుట్టలేదని వాదించేవాడని నీలమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని, హత్యకు సంబంధించి పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడిస్తామని ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.



### యుద్ధం ఎఫెక్ట్.. భారత్‌లో

## తులం బంగారం ధర రూ.2 లక్షలు దాటనుందా?




ప్రపంచంలో యుద్ధం జరుగుతుందనే సంకేతాలు వచ్చినప్పుడల్లా, బంగారం, వెండి ధరలు మొదట పెరగడం తరచుగా గమనించవచ్చు. అందుకే ఇరాన్‌పై ఇజ్రాయెల్-అమెరికన్ ఉమ్మడి దాడి తర్వాత బంగారం, వెండి ధరలు గణనీయంగా పెరగవచ్చనే ఊహాగానాలు ఉన్నాయి. అయితే బంగారం, వెండి ధరల.. ప్రపంచ రాజకీయాల్లో చోటు చేసుకుంటున్న తాజా పరిణామాలు సామాన్యుల జేబుకు చిల్లు పెట్టబోతున్నాయా? అంటే అవుననే అంటున్నారు ఆర్థిక నిపుణులు. అమెరికా, ఇరాన్ మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం అంతర్జాతీయ మార్కెట్లను వణికిస్తోంది. పసిడి, వెండి ధరలను రికార్డు స్థాయిలో పెరిగేలా కనిపిస్తోంది. ప్రస్తుతం ఉన్న ధరలు రాబోయే రోజుల్లో ఊహించని స్థాయికి పెరుగుతాయని, బంగారం ధర తులం (10 గ్రాములు) ఏకంగా రూ. 2 లక్షలు దాటే అవకాశం ఉందని బులియన్ మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అలాగే వెండి కూడా రికార్డ్ స్థాయిలో దూసుకుపోయే అవకాశం ఉందని చెబుతున్నారు. ప్రస్తుతం తులం బంగారం ధర రూ.1,73,080 ఉండగా, కిలో వెండి ధర రూ.2,95,000 వద్ద ఉంది. అదే హైదరాబాద్‌లో మాత్రం ఇంకా భారీగా ఉంది. కిలో వెండి ధర రూ.3,25,000 వద్ద ట్రేడవుతోంది. ప్రపంచవ్యాప్తంగా విలువైన లోహాల మార్కెట్లు ప్రస్తుతం జోరుగా సాగుతున్నాయి. శనివారం ఇరాన్‌పై ఇజ్రాయెల్ - అమెరికా సమన్వయంతో చేసిన దాడులు పెట్టుబడిదారుల ఆందోళనలను రేకెత్తించాయి. ఈ సంఘటన తర్వాత ప్రజలు తమ డబ్బును కాపాడుకోవడానికి బంగారం, వెండి వంటి సాంప్రదాయ వస్తువుల వైపు మొగ్గు చూపుతున్నారు. అమెరికా - ఇరాన్ మధ్య యుద్ధం గురించి పెరుగుతున్న చర్చ ఆర్థిక మార్కెట్లలో భయాందోళనలను సృష్టించవచ్చని విశ్లేషకులు అంటున్నారు. అటువంటి సమయాల్లో ప్రజలు బంగారం, వెండిని సురక్షితమైన పెట్టుబడులుగా భావిస్తారు. ప్రపంచంలో యుద్ధం జరుగుతుందనే సంకేతాలు వచ్చినప్పుడల్లా, బంగారం, వెండి ధరలు మొదట పెరగడం తరచుగా గమనించవచ్చు. అందుకే ఇరాన్‌పై ఇజ్రాయెల్-అమెరికన్ ఉమ్మడి దాడి తర్వాత బంగారం, వెండి ధరలు గణనీయంగా పెరగవచ్చనే ఊహాగానాలు ఉన్నాయి. అయితే బంగారం, వెండి ధరల పెరుగుదల వెనుక ఇతర అంశాలు కూడా ఉన్నాయి.

**ధరలు పెరగడానికి ప్రధాన కారణాలు**

**భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు:** మధ్యప్రాచ్యంలో అమెరికా, ఇజ్రాయెల్ - ఇరాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు పెట్టుబడిదారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ప్రపంచం అనిశ్చితిని ఎదుర్కొంటున్నప్పుడు పెట్టుబడిదారులు బంగారం, వెండిని తమ బలమైనదిగా భావిస్తారు.

**ఖూ డాలర్ కదలిక:** బంగారం, వెండి ధరలను కొనసాగించడంలో డాలర్ బలహీనపడటం కూడా ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. డాలర్ బలహీనపడినప్పుడు ఇతర కరెన్సీలను కలిగి ఉన్నవారు బులియన్ కొనుగోలు చేయడం చౌకగా మారుతుంది. ఇది డిమాండ్‌ను పెంచుతుంది.

**సెంట్రల్ బ్యాంక్ కొనుగోళ్లు:** ద్రవ్యోల్బణం, ఆర్థిక అస్థిరత నుండి రక్షించడానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న సెంట్రల్ బ్యాంకులు విలువైన లోహాలను నిరంతరం సేకరించుకుంటున్నాయి. పెరిగిన సెంట్రల్ బ్యాంక్ డిమాండ్ ధరలకు మద్దతు ఇస్తుందని భారత ఆర్థిక మంత్రి ఇటీవల నొక్కి చెప్పారు.

**వెండి ద్వంద్వ పాత్ర:** వెండికి డిమాండ్ పెరగడానికి మరో ప్రధాన కారణం ఏమిటంటే ఇది సురక్షితమైన పెట్టుబడి మాత్రమే కాదు, సాంకేతికత, గ్రీన్ ఎనర్జీ రంగాలలో కూడా విస్తృతంగా ఉపయోగిస్తారు. ఇది దాని ధరకు మద్దతు ఇస్తుంది.

### వెండి ధరలపై వార్ ఎఫెక్ట్..!

## రేపు పరిస్థితి ఎలా ఉండనుందంటే..?



మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు ప్రపంచ మార్కెట్లను కుదిపేస్తున్నాయి. పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తులైన బంగారం, వెండి వైపు చూస్తున్నారు. బంగారం స్పందించగా, వెండి భారీ పెరుగుదలకు సిద్ధంగా ఉంది. సోమవారం వీజెు ట్రేడింగ్ వెండి దిశను నిర్ణయిస్తుంది. ముడి చమురు, ఈక్విటీ మార్కెట్లలో అస్థిరత పెరగొచ్చు. మధ్యప్రాచ్యంలో తాజా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ప్రపంచ మార్కెట్లను కుదిపేస్తున్నాయి. ఈ నేపథ్యంలో పెట్టుబడిదారులు మళ్లీ సురక్షిత ఆస్తుల వైపు పరుగులు తీస్తుండగా, బంగారం ఇప్పటికే మొదటి స్పందన చూపింది. ఇప్పుడు అందరి దృష్టి వెండిపై పడింది. సోమవారం భారతీయ ఎక్స్ఛేంజీలు తెరుచుకున్నప్పుడు వెండి ధరలు పెరుగుతాయా అన్నది కీలక ప్రశ్నగా మారింది. సాంప్రదాయ మార్కెట్లు మూసివున్న సమయంలో కూడా సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. 24/7 ట్రేడింగ్ కలిగిన టెథర్ గోల్డ్ దాదాపు 4 శాతం పెరగడం పెట్టుబడిదారుల భయాన్ని సూచిస్తోంది. సాధారణంగా భౌగోళిక సంక్షోభాల్లో ముందుగా బంగారం స్పందించినా, ఊపు పెరిగిన తర్వాత వెండి ఎక్కువ శాతం హెచ్చుతగ్గులు చూపే చరిత్ర ఉంది. అందుకే ఈసారి కూడా వెండి లేట్ కానీ షార్ప్ మూవ్ ఇవ్వవచ్చని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. సోమవారం మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (వీజెు) తెరుచుకున్న వెంటనే ట్రేడర్లు మూడు అంశాలను గమనిస్తారు:

**ప్రారంభ గ్యాప్ పరిమాణం (బంగారం, వెండి ఫ్యూచర్లలో)**

సేఫ్ హెవెన్ కొనుగోళ్ల స్థిరత్వం, భారతీయ రిటైల్ పెట్టుబడిదారులు కొనుగోలు పెంచుతారా లేదా లాభాలు బుక్ చేస్తారా, ఇవి వెండి ర్యాలీ కొనసాగుతుందా లేదా తాత్కాలిక స్పైక్ మాత్రమేనా అన్నది నిర్ణయిస్తాయి. ప్రస్తుతం దేశీయంగా వీజెు గోల్డ్ రూ.1,60,000 పైన స్థిరంగా ఉంది, రూ.1,63,500-1,65,000 వైపు కదిలే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. వెండి మాత్రం మరింత వేగంగా కదులుతోంది. వీజెు వెండి ఇప్పటికే రూ.2,80,000-2,85,000 శ్రేణిని తాకింది. కీలక మద్దతు స్థాయిల పైన నిలిస్తే రూ.2,90,000--2,95,000 వరకు మరింత ఎగబాకే అవకాశముందని అంచనాలు ఉన్నాయి. ఈ ఉద్రిక్తతల ప్రభావం ముడి చమురు మార్కెట్‌పైనా పడింది. సరఫరా అంతరాయాలు ఏర్పడితే బ్యారెల్‌కు 80 డాలర్ల స్థాయి పరీక్షకు వచ్చే అవకాశముందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఇది ద్రవ్యోల్బణ ఒత్తిడిని మరింత పెంచే ప్రమాదం ఉంది. బ్రోకరేజ్ వర్గాలు ఈక్విటీ మార్కెట్లలో అస్థిరత పెరగొచ్చని చెబుతున్నాయి. కీలక మద్దతు స్థాయిలు తెగితే సూచీలు మరింత బలహీనపడే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో విలువైన లోహాల్లో వోలాటిలిటీ ఎక్కువగా ఉండే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. అయితే భయంతో వెంబడించే ట్రేడింగ్ కంటే స్థాయిలను గమనిస్తూ జాగ్రత్తగా వ్యవహరించడం పెట్టుబడిదారులకు కీలకం. సోమవారం ఓపెనింగ్ వెండి దిశను నిర్ణయించే కీలక సెషన్‌గా మారే అవకాశముంది.

### అంగన్వాడీల సంక్షేమానికి

## కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**గత ప్రభుత్వ ఆర్థిక విధ్వంసంలోనూ.. ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు**

**9 నెలల పాలనలోనే అంగన్వాడీల గ్రాట్యుటీ కల సాకారం - రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ వెల్లడి**



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, చిరుద్యోగుల సంక్షేమానికి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ స్పష్టం చేశారు. ఆదివారం రామచంద్రపురంలోని మంత్రి క్యాంపు కార్యాలయం నుండి ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీయించిందని, వారు చేసిన అప్పులకు వడ్డీలు కట్టడానికే మళ్లీ అప్పులు చేయాల్సిన దుస్థితి నేడు రాష్ట్రంలో ఉందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇంత క్లిష్టంగా ఉన్నప్పటికీ, ఉద్యోగుల సంక్షేమానికే కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, నిలకడగా ప్రతి నెలా ఒకటో తేదీననే వేతనాలు చెల్లిస్తూ ఉద్యోగులకు కొండంత భరోసాగా నిలుస్తోందని మంత్రి పేర్కొన్నారు.

**చరిత్రలో తొలిసారి ఆ ఘనత చంద్రబాబుదే:**

అంగన్వాడీల వేతనాలను చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా రెండుసార్లు పెంచిన ఘనత టీడీపీ ప్రభుత్వానికీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికే దక్కుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, అంగన్వాడీలు ప్రతిపాదించిన డిమాండ్లలో ఇప్పటికే 9 డిమాండ్లను పరిష్కరించామని తెలిపారు. వేతనాల పెంపు అంశాన్ని కూడా వీలైనంత వరకు అమలు చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు.

**గ్రాట్యుటీ కల సాకారం.. మినీ కేంద్రాల అప్‌గ్రేడ్:**

ఏళ్ల తరబడి అంగన్వాడీలు ఎదురుచూస్తున్న గ్రాట్యుటీ కలను కూటమి ప్రభుత్వం కేవలం 9 నెలల్లోనే నిజం చేసిందన్నారు. దీనికోసం 2025 బడ్జెట్‌లో రూ. 20 కోట్లు కేటాయించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 5,000 మినీ అంగన్వాడీ కేంద్రాలను పూర్తిస్థాయి కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేస్తున్నామని, ఇందులో భాగంగా మినీ కార్యకర్తలకు టీచర్లుగా పదోన్నతి కల్పించి పూర్తి వేతనం అందిస్తామని ప్రకటించారు. కొత్తగా 5,000 మంది సహాయకులను (హెల్పర్స్) నియమిస్తామన్నారు. అలాగే టీచర్లు, ఆయాలకు వేసవిలో 15 రోజులు సెలవులు మంజూరు చేశామని మంత్రి వివరించారు.

**డిజిటల్ సేవలు:**

అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్ల నిర్మాణం కోసం ప్రత్యేకంగా రూ. 86.68 లక్షలు విడుదల చేశామన్నారు. కేంద్రాలకు టీవీలు, ఆర్‌ఓ ప్లాంట్లు, టాయిలెట్ సౌకర్యం, పిల్లల కోసం ఆట వస్తువులు, విద్యా బోధనకు చార్టులు, ఇండక్షన్ స్టవ్‌లు, నాణ్యమైన వంట పాత్రలు సమకూర్చామన్నారు. రూ. 75 కోట్ల వ్యయంతో 58,204 మంది వర్కర్లు, సూపర్ వైజర్లు, బ్లాక్ కోఆర్డినేటర్లకు 5+ స్మార్ట్‌ఫోన్లు అందించామన్నారు. ఈ స్మార్ట్‌ఫోన్ల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు సేవలు మరింత వేగంగా, సమర్థవంతంగా అందుతున్నాయని, ఫలితంగా కేంద్రాల్లో హాజరు శాతం 70 నుంచి 96 శాతానికి పెరిగిందని ఇది కూటమి పాలన పారదర్శకతకు నిదర్శనమని మంత్రి సుభాష్ వెల్లడించారు.

### చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్ సేవలకు

## విశిష్ట గౌరవం

**3వ ప్రపంచ తెలుగు మహాసభల వేదికగా ఘన సత్కారం**




**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

సామాజిక సేవా రంగంలో విశేష సేవలు అందిస్తూ కోట్లాది అభిమానుల హృదయాలలో స్థానం సంపాదించిన చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్ సేవలకు మరో అరుదైన గౌరవం లభించింది. అమలాపురంలోని కిమ్స్ హాస్పిటల్ మరియు గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన మూడవ ప్రపంచ తెలుగు మహాసభల వేదికపై ఈ ట్రస్ట్‌కు ప్రత్యేక సత్కారం జరిగింది. ఈ సందర్భంగా పద్మభూషణ్ అవార్డు గ్రహీత, మెగాస్టార్ చిరంజీవి తరపున చిరంజీవి బ్లడ్ బ్యాంక్ ముఖ్య నిర్వహణాధికారి రవణం స్వామి నాయుడు జ్ఞాపికను స్వీకరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ స్వయంగా జ్ఞాపికను అందజేసి ట్రస్ట్ చేస్తున్న సేవలను కొనియాడారు. గవర్నర్ తన ప్రసంగంలో మాట్లాడుతూ, చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న రక్తదాన శిబిరాలు, అత్యవసర రక్త సరఫరా సేవలు, పేదలకు వైద్య సహాయం వంటి కార్యక్రమాలు వేలాది కుటుంబాలకు ప్రాణాధారంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. అత్యవసర సమయాల్లో రక్తం అందుబాటులో లేక ఇబ్బందులు పడే పరిస్థితులను తగ్గించడంలో చిరంజీవి రక్త బ్యాంక్ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. 2000ల ప్రారంభం నుండి సేవా కార్యక్రమాలు ప్రారంభించిన ఈ ట్రస్ట్, రక్తదానం మాత్రమే కాకుండా నేత్రదానం, ఆరోగ్య శిబిరాలు, వైద్య సహాయం వంటి పలు కార్యక్రమాల ద్వారా సమాజానికి అండగా నిలుస్తోంది. రాష్ట్రాలకతీతంగా దేశవ్యాప్తంగా రక్తం అవసరమైన వారికి సకాలంలో అందించడం ద్వారా అనేక ప్రాణాలను కాపాడిన ఘనత ఈ ట్రస్ట్‌దేనని పలువురు అభిప్రాయపడ్డారు. నిర్వాహకులు మాట్లాడుతూ ప్రపంచ తెలుగు మహాసభల వంటి ప్రతిష్టాత్మక వేదికపై చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్‌కు గౌరవం దక్కడం తెలుగు ప్రజలందరికీ గర్వకారణమని తెలిపారు. సేవా దృక్పథంతో ముందుకు సాగుతున్న ఈ ట్రస్ట్ యువతకు ప్రేరణగా నిలుస్తోందని అన్నారు. కార్యక్రమంలో వైద్యులు, విద్యావేత్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సభా వేదికపై చిరంజీవి సేవలను స్మరించుకుంటూ ఘనంగా చప్పట్లతో అభినందించారు. సామాజిక బాధ్యతను చాటుతూ నిరంతర సేవలతో ముందుకు సాగుతున్న చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్‌కు ఈ సత్కారం మరో మైలురాయిగా నిలిచింది.

## ఘనంగా విజయవాడలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర స్థాయి సమావేశం




**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

విజయవాడలో ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏ పి యు డబ్ల్యూ జె) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వివిధ జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శుల సమావేశం ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశానికి యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఐవి సుబ్బారావు అధ్యక్షత వహించారు. సమావేశం విజయవాడలోని ఫిల్మ్ ఛాంబర్ అసోసియేషన్ హాల్‌లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజెయు) జాతీయ అధ్యక్షుడు కె.శ్రీనివాస రెడ్డి, ఐజేయు జాతీయ కార్యదర్శి డి. సోమసుందర్, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.జయరాజ్, విశాలాంధ్ర అసిస్టెంట్ ఎడిటర్ కె.అజయ్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏచూరి శివ, సామ్నా రాష్ట్ర అధ్యక్షుడు నల్లి ధర్మారావు తదితరులు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఈ నెల 28, 29 తేదీల్లో విజయవాడలో నిర్వహించనున్న ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ జాతీయ సమావేశ ఏర్పాట్లపై సమగ్ర చర్చ జరిగింది. ఈ ప్రతిష్టాత్మక సమావేశానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరుకానున్నారు. దేశవ్యాప్తంగా 29 రాష్ట్రాల నుండి దాదాపు 400 మంది ప్రతినిధులు (డెలిగేట్స్) పాల్గొననున్నారు. సుమారు 30 సంవత్సరాల తరువాత విజయవాడలో ఇంత పెద్ద స్థాయిలో జరగనున్న ఈ హై లెవల్ సమావేశం జర్నలిస్టుల ఐక్యతకు, హక్కుల సాధనకు కొత్త దిశానిర్దేశం చేస్తుందని నాయకులు అభిప్రాయపడ్డారు. సమావేశం విజయవంతం కావడానికి తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర నాయకత్వం సూచనలు ఇచ్చింది. ఈ ముందస్తు సమీక్షా సమావేశంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడు, రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎం.ఎన్.వి. ప్రసాద్ (మండేలా బాబీ) పాల్గొని పలు అంశాలపై తన అభిప్రాయాలు వ్యక్తం చేశారు. జిల్లా స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు జర్నలిస్టుల సమస్యలను సమగ్రంగా పరిష్కరించే దిశగా ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశం జర్నలిస్టుల సంక్షేమం, వృత్తి భద్రత, హక్కుల పరిరక్షణ దిశగా కీలక నిర్ణయాలకు వేదికగా నిలిచింది.

## ఆదివారం కూడా ప్రజాదర్బార్

**ప్రజల అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు**



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**


ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని స్పష్టం చేస్తూ అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆదివారం కూడా విశ్రాంతి తీసుకోకుండా ప్రజా దర్బార్ నిర్వహించారు. అమలాపురం పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఉన్న క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ అర్జీలను సమర్పించారు. ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకోవాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ ప్రజాదర్బార్‌లో సుమారు 32 అర్జీలు స్వీకరించారు. ప్రతి ఒక్కరినీ ఆత్మీయంగా పలకరించిన ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, వారి సమస్యలను ఓపికగా విని, తక్షణ పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అర్జీలలో ప్రధానంగా భూ సమస్యలు, గృహ నిర్మాణాలు, పింఛన్లు, రేషన్ కార్డులు, మౌలిక వసతుల అంశాలు ఉన్నట్లు తెలిసింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రజల వద్దకే పాలన లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. అలాగే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి సామాన్యుడి గొంతుక వినబడేలా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. మంత్రి నారా లోకేష్ మార్గదర్శకత్వంలో ప్రజా సమస్యల పరిష్కారమే ఏకైక ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగు తోందని వెల్లడించారు. ప్రజలు నేరుగా ప్రజాప్రతినిధులను కలిసే అవకాశాన్ని కల్పిం చడం ద్వారా పాలనలో పార దర్శకత పెరుగుతుందని, సమ స్యలు త్వరితగతిన పరిష్కారం పొం దుతాయని ఎమ్మెల్యే అయితా బత్తుల ఆనందరావు పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడమే తమ ముఖ్య బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## శ్రీవారిని దర్శించుకున్న భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్



**విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుమలకు విచ్చేసిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆదివారం ఉదయం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. జస్టిస్ సూర్యకాంత్ గారికి ఆలయ మహాద్వారం వద్ద టీటీడీ ఆలయ చైర్మన్ బి. ఆర్. నాయుడు, ఈవో ముద్దాడ రవి చంద్ర, అదనపు ఈవో శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరి, జిల్లా ఎస్పి ఎల్. సుబ్బారాయుడు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అర్చకులు మేళతాళాల మధ్య వేద మంత్రాలు నడుమ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం తరువాత భారత ప్రధాన న్యాయమూర్తి ని అర్చకులు శేష వస్త్రం కప్పిన అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందజేశారు. అటు తరువాత టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు, ఈవో ముద్దాడ రవి చంద్ర, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి,భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి తీర్థప్రసాదాలు, స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీ వరహస్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సీవీఎస్వో మురళీకృష్ణ అధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



విశ్వం వాయిస్
VISWAMVOICE TELUGU DAILY
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎడిషన్
సోమవారం, 02 మార్చి 2026
www.viswamvoice.com





# నాడు కల.. నేడు నిజం...

**గత 30 ఏళ్ల తాగునీటి సమస్యకు పరిష్కారం చూపిన మంత్రి సుభాష్**
**మంత్రి కృషితో మసకపల్లి–సుందరపల్లి గ్రామాలకు స్వచ్ఛ త్రాగునీరు**
**రూ.60 లక్షలతో రక్షిత నీటి పథకానికి శంకుస్థాపన – ఆర్ఓ ప్లాంట్ ప్రారంభం**
**కోరమండల్ ఇంటర్నేషనల్ సేవలు అభినందనీయం : మంత్రి సుభాష్**




**కే.గంగవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం నియోజకవర్గం కె.గంగవరం మండలం మసకపల్లి, సుందరపల్లి గ్రామాల్లో గత 30 ఏళ్లుగా త్రాగునీటి సమస్యతో బాధపడుతున్న ప్రజలకు శాశ్వత పరిష్కారం లభించింది. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ చేతుల మీదుగా కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సీఎస్ఆర్ నిధులు రూ.60 లక్షలతో నిర్మించనున్న రక్షిత మంచి నీటి పథకానికి శంకుస్థాపన జరిగింది. అనంతరం సుందరపల్లి గ్రామంలో నిర్మించిన ఆర్ఓ నీటిశుద్ధి కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి సుభాష్ మాట్లాడుతూ, సామాజిక బాధ్యతతో కోరమండల్ ఇంటర్నేషనల్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. సీఎస్ఆర్ కింద కాకినాడ వాకలపూడిలో అధునాతన ఆసుపత్రి ఏర్పాటు చేసి ప్రజలకు కార్పొరేట్ వైద్య సేవలు అందించడం శుభ పరిణామమని తెలిపారు. రామచంద్రపురం నియోజకవర్గంలో కియా మోటార్స్ సహకారంతో రూ.2 కోట్ల వ్యయంతో "డాక్టర్ ఆన్ వీల్స్" వైద్య సేవలు అందించనున్నట్లు ప్రకటించారు. అలాగే ఓఎన్జిసి సహకారంతో సుమారు రూ.5 కోట్లతో గుండె సంబంధిత వ్యాధుల అధునాతన చికిత్స కోసం ఆసుపత్రి నిర్మాణానికి కృషి చేస్తున్నామన్నారు. "నియోజకవర్గంలో ఒక్కరూ గుండెపోటుతో మరణించకూడదనే లక్ష్యంతో ఈ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాం" అని మంత్రి తెలిపారు. గత 20 నెలల్లో పుష్కర నిధులతో కలిపి రూ.300 కోట్లకు పైగా నిధులు నియోజకవర్గానికి తీసుకొచ్చామని వెల్లడించారు. కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ, ప్రజల సౌకర్యార్థం స్వచ్ఛ నీటిని అందిస్తున్న కోరమండల్ ఇంటర్నేషనల్ బృందం వంశీకృష్ణ, పద్మనాభం తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నీటి పథకం గ్రామాల అభివృద్ధికి భగీరథ ప్రాజెక్టుగా నిలుస్తుందని అన్నారు. కోరమండల్ ప్రతినిధి పద్మనాభం మాట్లాడుతూ, మంత్రి సూచనల మేరకు నియోజకవర్గంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా స్థల దాతలు నిమ్మకాయల నాగేశ్వరరావు, నంబూరు శివప్రసాద్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు రవ్వ నాగభూషణం, కాటే సుబ్రహ్మణ్యం, సర్పంచ్ అన్నపూర్ణ కళ్యాణ్, గడ్డం శ్రీనివాస్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



### రాజమహేంద్రవరం విజ్ఞాన కేంద్రం సందర్శించిన

## విద్యా బాల మందిర్ విద్యార్ధులు




**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం కొత్తపేట విద్యా బాల మందిర్ హైస్కూలు విద్యార్థులు రాజమహేంద్రవరం విజ్ఞాన కేంద్రం సందర్శించారు.వీరికి తెలియని ఎన్నో విజ్ఞాన విషయాలు ప్రయోగాత్మకంగా చూసి తెలుసుకున్నారు.వీరు మొక్కలు ఆహారం తయారు చేసుకోనె విధానం,మురుగు నీటిని శుద్ధి చేసే విషయం, గురుత్వాకర్షణ శక్తి గురించి, నీటి కొరత మొదలైన అనేక విషయాలు గురించి తెలుసుకున్నారు.వీరికి మా పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు కందికట్ల శ్రీనివాస్,బూషి శ్యామల వివరించారు తదుపరి ధవళేశ్వరం కాటన్ పార్క్ సందర్శించారు ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు నూకపేయి శివరత్నం, ఉపాధ్యాయులు సుధాకర్, ప్రేమ అక్షిత,కామాక్షి, విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ఉల్లాసంగా పాల్గొన్నారు.

### కరుటూరి నరసింహారావును

## పరామర్శించిన కొత్తపేట టిడిపి నాయకులు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆత్రేయపురం, అంకంపాలెం పితృవియోగంతో బాధపడుతున్న నీటి సంఘం ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వాడపల్లి దేవస్థానం మాజీ చైర్మన్ కరటూరి నరసింహారావును కొత్తపేట మండల టిడిపి నాయకులు ధర్నాల రామకృష్ణ కంఠంశెట్టి శ్రీనివాసరావు గుబ్బల మూర్తి పరామర్శించారు. ఆత్రేయపురం మండలం అంకంపాలెంలోని వారి స్వగృహం నందు నరసింహారావు తండ్రి కృష్ణమూర్తి చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.మాజీ జెడ్పిటిసి ధర్నాల రామకృష్ణ కంఠంశెట్టి శ్రీనివాస్ గుబ్బల మూర్తి కుదప కృష్ణమూర్తి గొడవర్తి బాబి తదితరులు పరామర్శించారు.

### ప్రపంచ వేదికపై

## తెలుగు మహోన్నతిని చాటిన చైర్మన్ చైతన్య రాజు

### గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ప్రశంసలు





**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

సుదీర్ఘ చరిత్ర, మహోన్నత సాహిత్య సంపద, అపూర్వమైన సాంస్కృతిక వైభవం కలిగిన తెలుగు భాషను ప్రపంచ వేదికపై మరింత ప్రతిష్ఠాత్మకంగా నిలబెట్టేందుకు విశేష కృషి చేస్తున్న చైర్మన్ చైతన్య రాజు సేవలను రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ప్రత్యేకంగా ప్రశంసించారు. స్థానిక కిమ్స్ ప్రాంగణంలో గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ, కిమ్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మూడవ ప్రపంచ తెలుగు మహాసభల రెండో రోజు కార్యక్రమానికి గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ తెలుగు భాష తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. దేశ భాషలందు తెలుగు లెస్స అన్న శ్రీకృష్ణదేవరాయలు వాక్యాలు నేటికీ ప్రతి తెలుగువాడికి స్ఫూర్తినిస్తాయని తెలిపారు. అయితే, ఈ మహాసభలను అత్యంత వైభవంగా నిర్వహిస్తూ ప్రపంచ నలుమూలలలో ఉన్న తెలుగువారిని ఒకే వేదికపైకి తీసుకువచ్చిన చైర్మన్ చైతన్య రాజు కృషి అభినందనీయమని గవర్నర్ స్పష్టం చేశారు. తెలుగు భాషాభివృద్ధికి చైతన్య రాజు చేస్తున్న సేవలు కేవలం సభల నిర్వహణకే పరిమితం కావని, యువతలో భాషాపట్ల గౌరవం పెంపొందించే దిశగా పలు కార్యక్రమాలు చేపడుతున్నారని ఆయన కొనియాడారు. భవిష్యత్ తరాలకు తెలుగు వారసత్వాన్ని అందించాలనే సంకల్పంతో ఈ మహాసభలను ఘనంగా నిర్వహించడం విశేషమన్నారు. వ్యవహారిక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి తెలుగు భాషను ప్రజలకు చేరువ చేసిన తీరు స్మరణీయమని గవర్నర్ పేర్కొన్నారు. అదేవిధంగా ఆదికవి నన్నయ్య, తిక్కన, ఎర్రప్రగడ మహాభారత ఆంధ్రీకరణం ద్వారా తెలుగు సాహిత్యానికి స్వర్ణ యుగాన్ని తెచ్చారని గుర్తుచేశారు. పోతన భాగవతం, వేమన సుభాషితాలు తెలుగు సంస్కృతిని ప్రతిబింబించే అమూల్య రత్నాలని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా సుమారు 10 కోట్ల మంది తెలుగువారు ఉన్నారని, ఈ భాష ఉనికిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని గవర్నర్ పేర్కొన్నారు. ఆధునిక యుగంలో సాంకేతిక రంగాల్లోనూ తెలుగు భాష వినియోగాన్ని పెంచుతూ భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మహాసభలను విజయవంతం చేయడంలో చైర్మన్ చైతన్య రాజు నాయకత్వం కీలక పాత్ర పోషించిందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, మార్గదర్శి ఎండీ శైలజ కిరణ్, డీఆర్డీఓ మాజీ చైర్మన్ సతీష్ రెడ్డి తదితరులు తెలుగు భాష వ్యాప్తిపై ప్రసంగిస్తూ చైతన్య రాజు సంకల్పాన్ని అభినందించారు. కార్యక్రమంలో విజయనగరం ఎంపీ అప్పలనాయుడు, స్థానిక ఎమ్మెల్యేలు ఆనందరావు, రవికిరణ్ వర్మ, శశివర్మ, అధికారులు, నిర్వాహకులు, ప్రపంచ నలుమూలల నుంచి విచ్చేసిన తెలుగు ప్రతినిధులు పాల్గొన్నారు. తెలుగు భాష వైభవాన్ని ప్రపంచానికి చాటి చెప్పే దిశగా చైర్మన్ చైతన్య రాజు చేస్తున్న కృషి భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని సభలో పలువురు అభిప్రాయపడ్డారు.

### అంగన్వాడీ ఉద్యోగులు వేతనాల పెంపు డిమాండ్‌పై

## ప్రభుత్వం సానుకూల స్పందన



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** అంగన్వాడీ ఉద్యోగులు ఛలో విజయవాడ విరమించాలి. రాష్ట్రవ్యాప్తంగా 5,000 మినీ అంగన్వాడీ కేంద్రాలను పూర్తి స్థాయి కేంద్రాలుగా అప్‌గ్రేడ్,మినీ కార్యకర్తలకు టీచర్లుగా ప్రమోషన్ పూర్తి స్థాయి వేతనాలు 5,000 కొత్త అంగన్వాడీ సహాయకుల నియామకం కొరకు ప్రభుత్వం నిర్ణయించిన కారణంగా విరమించుకోవాలని కొత్తపేట మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గనిశెట్టి వీరేష్, క్లస్టర్ ఇంఛార్జి పల్లి ఏసు వానపల్లి గ్రామంలో ఆదివారం అంగన్వాడీలను కలిసి విజ్ఞప్తి చేశారు.

## అంగన్వాడీల గౌరవం పెంచిన కూటమి ప్రభుత్వం

### చరిత్రలో నిలిచిపోయేలా గ్రాట్యుటీ మంజూరు : ఎమ్మెల్యే ఆనందరావు



**విశ్వం వాయిస్ న్యూస్ :** అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు మరియు చిరు ఉద్యోగుల కష్టాలను గుర్తించి, వారి జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు సాగుతోంది. ఎన్నికల సమయంలో అంగన్వాడీలకు ఇచ్చిన ప్రతి హామీని అక్షరాలా అమలు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం, ఆ మాటను నిలబెట్టుకుంటూ సంక్షేమ పరిపాలనకు నిదర్శనంగా నిలుస్తోంది. ఈ కార్యక్రమాల అమలులో స్థానిక ఎంఎల్ఏ ప్రత్యేక చొరవ, నిరంతర పర్యవేక్షణ కీలకంగా మారిందని కార్యకర్తలు అభినందిస్తున్నారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న గ్రాట్యుటీ సమస్యకు పరిష్కారం చూపుతూ 2025 బడ్జెట్‌లో రూ.20 కోట్లను కేటాయించడం అంగన్వాడీ చరిత్రలో మైలురాయిగా నిలిచింది. గతంలో ఎన్నో ప్రభుత్వాలు హామీలు ఇచ్చినా అమలు కాలేకపోయిన గ్రాట్యుటీ అంశాన్ని కూటమి ప్రభుత్వం కార్యరూపం దాల్చడం విశేషం. దీని వల్ల వేలాది మంది అంగన్వాడీ కార్యకర్తలకు ఆర్థిక భరోసా కలిగింది. డిజిటల్ సాధికారత దిశగా కూడా ప్రభుత్వం వినూత్న నిర్ణయం తీసుకుంది. సేవలను మరింత వేగవంతం చేయడానికి రూ.75 కోట్ల వ్యయంతో 58,204 మంది అంగన్వాడీ సిబ్బందికి హైటెక్ ఫైవ్ జీ స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేసింది. ఈ ఫోన్ల ద్వారా హాజరు నమోదు, పిల్లల ఆరోగ్య వివరాలు, పోషణ సమాచారం వంటి అంశాలను సులభంగా నమోదు చేసే అవకాశం కలిగింది. దీంతో పరిపాలనలో పారదర్శకత పెరిగి, సేవల నాణ్యత మెరుగుపడింది. రాష్ట్రవ్యాప్తంగా 5,000 మినీ అంగన్వాడీ కేంద్రాలను పూర్తిస్థాయి కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేసి, అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి టీచర్లుగా పదోన్నతి కల్పించడం మరో కీలక నిర్ణయం. పూర్తి వేతనంతో గౌరవప్రదమైన స్థానం కల్పించడం ద్వారా వారి సామాజిక భద్రతను ప్రభుత్వం బలోపేతం చేసింది. ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు అందేలా శాశ్వత విధానం అమలు చేయడం ద్వారా కుటుంబాల ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుతోంది. అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. పిల్లల విద్యా అభివృద్ధికి అధునాతన టీవీలు, ఆకర్షణీయమైన ఆటవస్తువులు, రంగురంగుల చార్టులు అందజేస్తోంది. స్వచ్ఛమైన తాగునీటి కోసం ఆర్ ఓ ప్లాంట్లు ఏర్పాటు చేయడంతో పాటు, పరిశుభ్రమైన వాతావరణం కోసం ప్రత్యేక మరుగుదొడ్లు నిర్మిస్తోంది. వంట ప్రక్రియలో పొగ సమస్యను నివారించేందుకు ఇండక్షన్ స్టవ్‌లు, నాణ్యమైన వంట పాత్రలు అందించడం ద్వారా హైటెక్ కిచెన్ సౌకర్యాలు కల్పించింది. తాగునీరు, మరుగుదొడ్ల నిర్మాణం కోసం రూ.86.68 లక్షల నిధులను విడుదల చేయడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో కూడా సౌకర్యాల మెరుగుదలకు చర్యలు చేపట్టింది. వేసవిలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలకు 15 రోజుల ప్రత్యేక సెలవులు మంజూరు చేయడం చరిత్రలో తొలిసారిగా జరిగింది. ఇది వారి ఆరోగ్యం, కుటుంబ జీవనానికి ఉపశమనం కలిగించే నిర్ణయంగా నిలిచింది. గత ప్రభుత్వాల వల్ల ఏర్పడిన ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ కూడా ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం ఇప్పటికే 9 ప్రధాన డిమాండ్లను పరిష్కరించింది. వేతనాల పెంపుపై కూడా సానుకూల చర్చలు కొనసాగుతున్నాయి. అంగన్వాడీ సిబ్బంది సంక్షేమమే లక్ష్యంగా తీసుకున్న ఈ నిర్ణయాలు రాష్ట్రంలో సంక్షేమ పరిపాలనకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఎమ్మెల్యే మార్గదర్శకత్వంలో అమలవుతున్న ఈ సంక్షేమ కార్యక్రమాలు అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నాయని కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మీద పూర్తి నమ్మకంతో అంగన్వాడీలు రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ప్రజాప్రతినిధులు పిలుపునిస్తున్నారు.

## అంగన్‌వాడీలకు అండగా కూటమి ప్రభుత్వం ఉంది : కొత్తపేట ఎమ్మెల్యే



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, చిరు ఉద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉంది గతంలో ఎన్నడూ లేని విధంగా చరిత్రలోనే తొలిసారిగా రెండు సార్లు అంగన్వాడీ వేతనాలు పెంచినఘనత తెలుగుదేశం ప్రభుత్వానికీ, చంద్రబాబు నాయుడుకీ దక్కుతుంది. ఎన్నికల్లో అంగన్వాడీలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడానికి కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుంది. అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్వాడీ కేంద్రాల మౌలిక సదుపాయాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాల్లో తాగునీటి సౌకర్యాలు, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.86.68 లక్షలు విడుదల చేసి, ఒక్కో కేంద్రానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించింది. అంగన్వాడీలకు ప్రతి నెల ఒకటో తేదీనే వేతనాలు అందేలా చర్యలు తీసుకుని, జీతాల ఆలస్యానికి శాశ్వతంగా చెక్ పెట్టింది. 58,204 మంది అంగన్వాడీ వర్కర్లు, సూపర్వైజర్లు, బ్లాక్ కోఆర్డినేటర్లకు రూ.75 కోట్ల వ్యయంతో 5+ స్మార్ట్ ఫోన్లు అందించింది. ఈ స్మార్ట్ ఫోన్ల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు మరింత వేగంగా, సమర్థవంతంగా సేవలు అందుతున్నాయి. అంగన్వాడీ కేంద్రాల హాజరు 70 శాతం నుంచి 96 శాతానికి పెరగడం కూటమి పాలనకు వచ్చిన ప్రత్యక్ష ఫలితం. ఏళ్ల తరబడి అంగన్వాడీలు ఎదురుచూసిన గ్రాట్యుటీ కలను కూటమి ప్రభుత్వం నిజం చేసింది. గ్రాట్యుటీ చెల్లింపుల కోసం 2025 ఆంధ్రప్రదేశ్ బడ్జెట్లోనే రూ.20 కోట్లు కేటాయించింది అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోనే అంగన్వాడీలకు అండగా నిలిచింది. అంగన్వాడీ సెంటర్‌కు టివి, ఆర్ఓలు, టాయిలెట్ సౌకర్యం, టీచర్లు, ఆయాలకు వేసవిలో 15 రోజులు సెలవులు, ఆటవస్తువులు, పాఠాలు చెప్పడానికి వీలుగా చార్టులు," ఇండక్షన్ స్టవ్, నాణ్యమైన వంట పాత్రలు ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 5,000 మినీ అంగన్వాడీ కేంద్రాలను పూర్తి స్థాయి అంగన్వాడీ కేంద్రాలుగా అప్గ్రేడ్ చేస్తోంది. ఇందులో భాగంగా మినీ అంగన్వాడీ కార్యకర్తలకు టీచర్గా పదోన్నతి కల్పించి, పూర్తి స్థాయి వేతనాలు అందించనుంది. అలాగే కొత్తగా 5,000 మంది అంగన్వాడీ సహాయకులను నియమించనుంది. అంగన్వాడీలు ప్రతిపాదించిన డిమాండ్లలో 9 డిమాండ్లను ఇప్పటికే కూటమి ప్రభుత్వం పరిష్కరించింది. వేతనాల పెంపు అంశాన్ని కూడా వీలైనంత వరకు అమలు చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ, ఉద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. ప్రతి నెల ఒకటో తేదీననే వేతనాలు చెల్లిస్తూ, ఉద్యోగులకు భరోసాగా నిలుస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వం. గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక రంగాన్ని దివాళ తీసి వెళ్ళింది. వారు చేసిన అప్పులకు రాష్ట్రానికి వస్తున్న ఆదాయంతో పాటు ఇంకా అప్పులు తెచ్చి వడ్డీలు కట్టాల్సిన పరిస్థితి నేడు రాష్ట్రంలో ఉంది. అంగన్వాడీలు కూటమి పార్టీలుపై నమ్మకం నుంచి ప్రభుత్వానికి అండగా నిలవాలి అని అన్నారు.



### పల్లెల్ని అభివృద్ధి పదంలో నడిపేందుకు

# సీఎం చంద్రబాబు కృషి

## రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్



**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** పట్టణాలకు దీటుగా పల్లెల్ని అన్ని విధాలా అభివృద్ధి పదంలో నడిపేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అంకితభావంతో కృషి చేస్తున్నారని రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని కాజులూరు కుయ్యేరు ఉప్పుమిల్లి నామవానిపాలెం గ్రామాల్లో 1కోటి 43లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులలో నిర్మించే నాలుగు రహదారులకు ఆయన తండ్రి వాసంశెట్టి సత్యంతో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ ఆయా గ్రామాల్లో నెలకొన్న స్థానిక సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. గ్రామాల్లో రహదారులు మెరుగుపడితే విద్య, వైద్యం, వ్యవసాయం వంటి రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతాయని మంత్రి పేర్కొన్నారు. రహదారుల నిర్మాణం వల్ల రవాణా సమస్యలు తగ్గి, ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణం సాధ్యమవుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు మెరుగుపడటం ద్వారా గ్రామాల రూపురేఖలు మారుతాయని, ప్రభుత్వం గ్రామాల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. సంక్షేమ పథకాల అమలు ద్వారా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతోందని తద్వారా పేద ప్రజల జీవనోపాధి మెరుగుపడుతోందని మంత్రి పేర్కొన్నారు. మహిళా సాధికారత, యువత ఉపాధి, రైతులకు మద్దతు వంటి అంశాల్లో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. సంక్షేమ పథకాలతో పాటు మౌలిక సదుపాయాల అభివృద్ధి ద్వారానే గ్రామీణ ప్రాంతాలు సుస్థిర అభివృద్ధి దిశగా అడుగులు వేస్తాయని ఈ కార్యక్రమం మరోసారి రుజువు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు చవ్వాకుల నారాయణమూర్తి, అంబేద్కర్ కోనసీమ జిల్లా అధికార ప్రతినిధి వనుం వీరబ్రహ్మం, ఎంపీడీవో రాంబాబు పంచాయతీరాజ్ జేఈ శంకర్, మాజీ ఎంపీపీ యాళ్ల కృష్ణారావు, సొసైటీ చైర్మన్లు యాళ్ల వెంకటరమణ, యాళ్ల తనిబాబు, కొల్లు వెంకటేశ్వరరావు, నీటి సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ, చోడిశెట్టి శ్రీనివాస్, యాళ్ళ రవి, కామాడి బుజ్జి, టీడీపీ నాయకులు వెలుగుబంట్ల శ్రీరామచంద్రమూర్తి, వల్లు అర్జునరావు, రెడ్డి శేషరావు, సర్పంచ్ పి కృష్ణమూర్తి, దంతులూరి వంశీ, దుర్గారావు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గొంధి కొత్తపల్లిలో మూడు తాటాకిళ్ళు దగ్ధం

## నాలుగు కుటుంబాలు నిరాశ్రయం - ఒక్కో కుటుంబానికి 25 కేజీల బియ్యం పంపిణీ



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం గొంధి కొత్తపల్లి గ్రామంలో శనివారం అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో మూడు తాటాకు ఇళ్ళు దగ్ధం అయ్యాయి. పల్లా నారాయణమ్మ, బర్ల సింహాచలం, పెంటపాటి వరలక్ష్మిలకు చెందిన పక్క పక్కన ఉన్న మూడు తాటాకిళ్ళు ఏక కాలంలో దగ్ధం అయ్యాయి. ఈ ఇండ్లకు విద్యుత్తు సరఫరా సౌకర్యం లేకపోయినప్పటికీ వారి ఇండ్లు పై భాగం నుంచి వెళుతున్న ఇతరుల ఇండ్ల విద్యుత్తు తీగలతోని విద్యుత్ ప్రవాహపు విద్యుత్ఘాతం వల్ల ఈ అగ్ని ప్రమాదం సంభవించి ఉంటుందని భావిస్తున్నారు. ఈ అగ్ని ప్రమాదం ఫలితంగా ఈ మూడు ఇండ్లలోని ఆహార ధాన్యాలు, దినుసులు, బట్టలు, వస్తు సామాగ్రి, నగదు మొత్తం కాలి బూడిద అయ్యాయి. ఈ అగ్ని ప్రమాదాన్ని గుర్తించిన ఇరుగుపొరుగు వారు వెంటనే స్పందించి తక్షణ సహాయక చర్యలను చేపట్టారు. ముందుగా ఆ ఇండ్లలోని గ్యాస్ సిలిండర్ బండలను బయటకు తీసివేసి దూరంగా భద్రపరిచారు. దీంతో ఈ అగ్ని ప్రమాదం మంటలు మరిన్ని పక్క ఇండ్లకు వ్యాపించకుండా ఇరుగు పొరుగు వారు సకాలంలో ముందు జాగ్రత్త చర్యలను చేపట్టడం మేలైంది. ఈ మూడు ఇండ్లలోనూ నివాసం ఉంటున్న నాలుగు కుటుంబాల సభ్యులు అందరూ కట్టు బట్టలతో మిగిలి నిరాశ్రయులు అయ్యారు. ఈ అగ్ని ప్రమాదం వల్ల సుమారు రూ. 3 లక్షల వరకూ ఆస్తి నష్టం వాటిల్లిందని మండల రెవెన్యూ యంత్రాంగం అంచనా వేసింది. ఆదివారం సాయంత్రం మండల రెవెన్యూ యంత్రాంగం ఆధ్వర్యంలో ప్రభుత్వం తరఫున ఒక్కో కుటుంబానికి 25 కేజీల చొప్పున బియ్యాన్ని వీఆర్వో మసిలిపా సింహాచలం పంపిణీ చేశారు. ఇది మినహా ఇంకా ఇతరత్రా ఏవిధమైన తక్షణ సహాయం అందలేదు.

# ప్రమాదాల బారి నుండి హెల్మెట్ రక్షిస్తుంది



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆదివారం సాయంత్రం సర్పవరం జంక్షన్‌లో గల సిగ్నల్ పాయింట్ వద్ద ట్రాఫిక్ ఎస్ఐ అప్పారావు టు వీలర్ వాహనదారులకు అకస్మాత్తుగా జరుగుతున్న యాక్సిడెంట్ల వలన తలకు తగులుతున్న దెబ్బల వలన ఎంతోమంది మరణించడం జరుగుతుంది. అందువల్ల దయచేసి మీరందరూ కూడా వాహనాలు నడిపేటప్పుడు తలపై హెల్మెట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని మీ మీదే అసలు పెట్టుకొని ఉన్న మీ కుటుంబాల కోసమైనా హెల్మెట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని వాహనదారులకు సూచించారు. హెల్మెట్ కోసం వివరించి చెప్తున్నా పలువురు వాహనదారులు ఆయనను అభినందించారు. ఆయన కూడా ట్రాఫిక్ సిబ్బంది కూడా ఉన్నారు.

# నిప్పుతో చెలగాటం.. గాలిలో దీపంలా ప్రాణాలు..

## అత్యంత ప్రమాదకరంగా ఫైర్ వర్క్స్



ప్రమాదం జరిగిన చాలా సేపటి వరకు అక్కడికి ఎవరూ వెళ్లలేకపోవడం వల్ల తీవ్రత ఎక్కువగా ఉందని అంచనా వేస్తున్నారు. కాకినాడ జిల్లా వేట్లపాలెం బాణసంచా కేంద్రంలో విస్ఫోటనం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. ప్రమాదం జరిగిన చాలా సేపటి వరకు అక్కడికి ఎవరూ వెళ్లలేకపోవడం వల్ల తీవ్రత ఎక్కువగా ఉందని అంచనా వేస్తున్నారు. చుట్టూ పొలాలు ఉండటం, బాణసంచా తయారు చేస్తున్న చోటకు సరైన రోడ్డు వసతి లేకపోవడంతో ఫైర్ ఇంజిన్, అంబులెన్స్ వంటివి వెళ్లలేకపోయాయి. అంతేకాకుండా భీకర పేలుళ్ల శబ్దానికి దాదాపు గంట పాటు ఆ ప్రాంతానికి స్థానికులు ఎవరూ వెళ్లే సాహసం చేయలేకపోయారని చెబుతున్నారు. ఈ కారణంగా మంటల్లో చిక్కుకుని ఎక్కువ మంది మరణించారని అనుమానిస్తున్నారు. ప్రమాదం జరిగిన బాణసంచా తయారీ కేంద్రంలో ఎంత మంది కూలీలు పనిచేస్తున్నది ఇంకా స్పష్టత రాలేదు. ఘటన స్థలంలో ఉన్న వారిలో దాదాపు అందరూ ప్రాణాలు కోల్పోయినట్లు చెబుతున్నారు. తొలుత మృతుల సంఖ్య 18గా ఉంటుందని అనుకున్నా, సమయం గడుస్తున్న కొద్దీ మృతుల సంఖ్య పెరుగుతోంది. ప్రస్తుతం మృతుల సంఖ్య 22 వరకు ఉండొచ్చని అంటున్నారు. ప్రమాదంలో చిక్కుకున్న వారి శరీర భాగాలు గుర్తు పట్టలేని విధంగా ఛిద్రమయ్యాయి. పేలుడు ధాటికి మృతదేహాలు చుట్టుపక్కల పొలాల్లో చెల్లాచెదురుగా పడిపోయాయి. కొందరి అవయువాలు పొలాల్లో పడివుండటాన్ని స్థానికులు గుర్తించారు. ప్రమాదానికి సరైన కారణం తెలియడం లేదు. విస్ఫోటనం తీవ్రత ఎక్కువగా ఉండటంతో గంధకం నిల్వలే దుర్ఘటనకు దారితీసి ఉండొచ్చని నిపుణులు సందేహిస్తున్నారు. ఫోరెన్సిక్ ఆడిట్ జరిగితే కానీ, ప్రమాదానికి స్పష్టమైన కారణం చెప్పలేమని పోలీసులు చెబుతున్నారు. ఘటనా స్థలం భీతావహంగా కనిపిస్తోంది. మంటల్లో కాలిపోయి, తీవ్రంగా గాయపడిన వారిని అతికష్టం మీద ఆస్పత్రికి తరలిస్తున్నారు. ఇక మృతుల్లో ఎక్కువ మంది మహిళలు ఉన్నట్లు సమాచారం. ప్రమాద సమాచారం తెలుసుకుని చుట్టుపక్కల వారు, కూలీల బంధువులు అక్కడికి చేరుకుని తమ వారి సమాచారం తెలుసుకుంటున్నారు.

**గోదావరి జిల్లాల్లోనే ఎక్కువ**

రాష్ట్రంలో అనుమతి ఉన్న బాణసంచా కేంద్రాల్లో సగం ఉమ్మడి గోదావరి జిల్లాల్లోనే ఉన్నాయని అంటున్నారు. అదేవిధంగా అనుమతి లేని మందుగుండు సామగ్రి దుకాణాలు పెద్ద సంఖ్యలోనే కొనసాగుతున్నాయి. దీంతో ఏటా ఎక్కడో ఒక చోట ప్రమాదాలు జరగడం, కూలీల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాణాసంచా కేంద్రాల్లో పనిచేస్తున్న వారికి సరైన బీమా సౌకర్యం ఉండటం లేదని చెబుతున్నారు. నిప్పుతో చెలగాటం అని తెలిసినా పొట్టకూటి కోసం తెగించి పనులు చేయాల్సివస్తుందని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూలీలకు కనీసం బీమా కట్టకుండా గాలికి వదిలేస్తూ బాణసంచా తయారీ కేంద్రాల యజమానులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ప్రమాద నివారణ చర్యలు కరువు**

బాణసంచా దుకాణాలు, తయారీ కేంద్రాలు, గోదాముల వద్ద కనీస సదుపా యాలు ఉండటం లేదని చెబుతున్నారు. అంతేకాకుండా ప్రమాదాలు చోటుచేసుకున్న సమయంలో తక్షణ నివారణ చర్యలకు అవకాశం ఉండటం లేదు. బాణసంచా కేంద్రాల వద్ద విద్యుత్ సరఫరా ఉండకూడదనే నిబంధన ఉన్నా, చాలా మంది పెడచెవిన పెడుతున్నారని చెబుతున్నారు. దీంతో ప్రమాదాలు సంభవించినప్పుడు తీవ్రత ఎక్కువగా ఉంటుందని అంటున్నారు. తీవ్రత తగ్గించే పరిక రాలు తూతూమంత్రంగా ఏర్పాటు చేయడం, ప్రమాద సమయంలో ఏం చేయాలో కనీస అవగాహన ఉండకపోవడం వల్ల కూలీల ప్రాణాలకు భద్రత లేకుండా పోతోందని చెబుతున్నారు.

### 'బొత్స' స్థానం కోసం

# వైసీపీలో పోటా పోటీ ..!



దీనిని బట్టి బొత్స సత్యనారాయణ కేవలం ఎమ్మెల్సీగా మాత్రమే కొనసాగనున్నారు. ప్రస్తుతం బడ్జెట్ సమావేశాల అనంతరం.. ఆయనను ఆ పదవి నుంచి తప్పించే ప్రయత్నాలు కూడా సాగుతున్నాయి. రాజకీయాల్లో తలపండిన నాయకుడు, అందరినీ కలుపుకొనిపోయే అజాత శత్రువుగా పేరొందిన బొత్స సత్యనారాయణ ప్రస్తుతం వైసీపీలో ఉన్నారు. ఆయన శాసన మండలిలో వైసీపీ పక్ష నాయకుడిగా వ్యవహరిస్తున్నారు. అయితే.. గత ఏడాది.. ప్రస్తుతం కూడా ఆయన అనారోగ్యానికి గురయ్యారు. ప్రస్తుతం బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై.. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన కొలుకుంటున్నారని వైద్య వర్గాలు చెబుతున్నాయి. అయితే.. ఇప్పుడున్నట్టుగా ఆయన వ్యవహరించరాదని చెబుతున్నారు. అంటే.. ప్రస్తుతం మండలిలో వైసీపీ పక్ష నాయకుడిగా ఆయన గళం వినిపిస్తున్నారు. కీలక అంశాలపై బలమైన వాయిస్ వినిపిస్తున్నారు. ఇదే.. ఆయన బ్రెయిన్ స్ట్రోక్‌కు గురి కావడానికి దారితీసిందని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మండలిలో ఆయన కొనసాగినా.. ఇకపై మండలిలో విపక్ష నాయకుడిగా ఉండేందుకు.. ఆయన సతీమణి ఝాన్సీ విముఖత వ్యక్తం చేశారు. ఆంగ్ల మీడియాతో మాట్లాడిన ఆమె.. బొత్స పై స్ట్రెస్ పెరిగిందని.. ఇక, నుంచి ఆయనకు స్ట్రెస్ తగ్గించడమే తమ పని అని చెప్పుకొచ్చారు. దీనిని బట్టి బొత్స సత్యనారాయణ కేవలం ఎమ్మెల్సీగా మాత్రమే కొనసాగనున్నారు. ప్రస్తుతం బడ్జెట్ సమావేశాల అనంతరం.. ఆయనను ఆ పదవి నుంచి తప్పించే ప్రయత్నాలు కూడా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో బొత్స సీటును కైవసం చేసుకునేందుకు నలుగురు కీలక నాయకులు వైసీపీలో పోటీ పడుతున్నారు. వీరిలో ఉత్తరాంధ్రకు చెందిన వరుదు కల్యాణి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. మండలిలో బలమైన గళం వినిపిస్తున్న నేపథ్యంలో తనకు ప్రాధాన్యం ఇస్తారని ఆమె చెప్పుకొంటున్నారు. ఈమెతో పాటు.. పార్టీ కీలక నాయకుడు, సీనియర్ నేత లేళ్ల అప్పిరెడ్డి సైతం నేను సైతం అంటున్నారు. పార్టీ తరఫున బలమైన వాయిస్ వినిపిస్తున్న లేళ్ల.. అధినేత జగన్‌కు నమ్మిన బంటుగా వ్యవహరిస్తున్నా రు. అలానే.. తలశిల రఘురాం కూడా తన ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈయన కూడా పార్టీలో కీలకంగానే ఉన్నారు. ఇక, పార్టీలో నమ్మిన బంటుగా వ్యవహరిస్తున్న పీవీవీ సూర్యనారాయణ రాజు సైతం బొత్స సీటు కోసం తహతహ లాడుతున్నారు. మొత్తంగా ఈ సీటు ఖాళీ అయితే.. దక్కించుకునేందుకు నాయకులు ఇప్పటికే ప్రయత్నాలు ముమ్మరం చేయడం పార్టీలో చర్చనీయాంశంగా మారింది.

# పవన్ జీవితాంతం పెద్దన్నే... లోకేష్ భావోద్వేగం



అమరావతిని ఒక నగరంగా నిర్మించడం లేదని అది దేశానికే గర్వకారణంగా రూపుదిద్దుకుంటోందని ఆయన చెప్పారు. ఒకే రాష్ట్ర ఒకే రాజధాని అన్నది తమ విధానం అన్నారు. జనసేన అధినేత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తనకు జీవితాంతం పెద్దన్నగా ఉంటారని అందులో అనుమానం లేదని మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. తమ బంధం గొప్పదని అన్నారు. అది కొనసాగి తీరుతుందని అన్నింటికీ అతీతంగా ఉంటుందని ఆయన అంటున్నారు. ముంబైలోని ముంబైలో ఏబీపీ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో ఐడియాస్ ఆఫ్ ఇండియా – 2026 సదస్సులో ఆయన పాల్గొని అనేక అంశాల మీద మాట్లాడారు, అందులో భాగంగా పవన్ గురించి ప్రస్తావన వచ్చినపుడు లోకేష్ భావోద్వేగపూరిత మైన సమాధానం ఇచ్చారు.

**చంద్రబాబు ఈ గ్రేట్ :** చంద్రబాబు వయసు పాతికేళ్ళే అని లోకేష్ చెప్పడం విశేషం. ఆయన 75 ఏళ్ల వారుగా ఉన్నా ఆయన ఉత్సాహం ఆయన పడుతున్న కష్టం ఆయన ఆలోచనన వేగం ఆయన లక్ష్యాలు వినూత్నమైన విధానాలు అన్నీ చూస్తే కనుక ఆయన పక్కా యువకుడి కిందనే లెక్క అన్నారు. ఆయనతో పరుగులు పెట్టడం ఎవరికీ సాధ్యం కాదని అన్నారు బాబు ఇచ్చే టాస్కులను తాము సాధించడమే పెద్ద టాస్క్ అని లోకేష్ చమత్కరించారు. ఆయన విజన్ ఎవరికీ అందదని ఆయన ఎపుడూ కొత్తదనం కోసమే చూస్తూంటారు అని లోకేష్ బాబు గురించి చెప్పుకొచ్చారు.

**నగరం కాదు :** అమరావతిని ఒక నగరంగా నిర్మించడం లేదని అది దేశానికే గర్వకారణంగా రూపుదిద్దుకుంటోందని ఆయన చెప్పారు. ఒకే రాష్ట్ర ఒకే రాజధాని అన్నది తమ విధానం అన్నారు. అలాగే అభివృద్ధి వికేంద్రీకరణ అన్నది తమ అభిమతంగా చెప్పారు. అదే సమయంలో విశాఖపట్నం, అమరావతి, తిరుపతిలను ఆర్థిక రీజియన్లుగా అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు ప్రగతిపథంలో సాగాలి అన్నది కూటమి పాలసీగా లోకేష్ చెప్పారు.

**నమోతోనే ఏపీ ప్రగతి :** ఏపీ అన్ని విధాలుగా ఇపుడు అభివృద్ధి సాధిస్తోంది అని లోకేష్ అన్నారు. దానికి నాయుడు మోడీ కాంబినేషన్ నమో కారణం అని లోకేష్ కొత్త నిర్వచనం ఇచ్చారు. కేంద్రంలో రాష్ట్రంలో ఒకే ప్రభుత్వం ఉండడం డబుల్ ఇంజన్ సర్కార్ తోనే ఏపీ ముందుకు సాగుతోంది అన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వల్ల కూడా ఏపీకి పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తున్నాయని లోకేష్ చెప్పారు. చంద్రబాబుని ఆయన విజన్ ని చూసి ఏపీకి పారిశ్రామికవేత్తలు పెద్ద ఎత్తున వస్తున్నారు అని లోకేష్ వివరించారు.

**ఎకోసిస్టమ్ డెవలప్ చేస్తున్నాం :** ఏపీలో ఏ పరిశ్రమ వచ్చినా అనుబంధ పరిశ్రమలను కూడా అనుసంధానం చేస్తూ ఎకోసిస్టమ్ ని అభివృద్ధి చేస్తున్నామని లోకేష్ చెప్పారు. ఉదాహరణకు ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలో ఫాక్స్‌కాన్ లాంటి ఒక కంపెనీని తీసుకురావడమే కాకుండా దానికి అనుగుణంగా ఐఫోన్ అసెంబుల్‌కు అవసరమైన అన్ని విడి భాగాల తయారీదారులను ఒకే చోటకు తీసుకురావడమే ప్రభుత్వం పారిశ్రామిక విధానం అని అన్నారు. ఎకోసిస్టమ్ డెవలప్ చేస్తే కనుక పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు వృద్ధి అవుతాయని ఆయన అన్నారు. భూమిని తక్కువ ధరకు ఇస్తున్నామన్నది కాదని ఆయా పరిశ్రమల వల్ల వచ్చే ఉపాధిని అభివృద్ధిని చూడాలని ఆయన కోరుతున్నారు. ఉదాహరణకు కాగ్నిజెంట్ కంపెనీన విశాఖలో రావడం వల్ల ఏకంగా పాతిక వెల దాక ఉద్యోగాలు వస్తాయని, ఏటా 1500 కోట్ల రూపాయల ఆర్థిక కార్యకలాపాలు జరుగుతాయని లోకేష్ వివరించారు..





# స్వర్ణ నంది అవార్డు రావడం ఆనందదాయకం

-నా సొంతం ధనం వెచ్చించి సేవా కార్యక్రమాలు చేస్తున్నా - నా కుటుంబ సభ్యులు సహకారం ఉంది
- దళితుల్లో ఎవరికి ఏ కష్టం వచ్చినా స్పందిస్తా - చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తున్నా
-పెందుర్తి వెంకటేష్, అభిరామ్ ల సపోర్టు మరువలేనిది - ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కితాబుకి ధన్యవాదాలు

**ఆదర్శ కళానిలయం స్వర్ణనంది అవార్డు గ్రహీత ఖండవిల్లి లక్ష్మి**





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తాను చేసిన సేవలను గుర్తించి స్వర్ణ నంది అవార్డు ఇచ్చినందుకు ఎంతో ఆనందంగా ఉందని హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆంధ్ర తెలంగాణ మహిళా చైర్మన్ , టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా సెక్రటరీ, ఆల్ ఇండియా షెడ్యూల్డ్ కులాల రాష్ట్ర మహిళా విభాగం ప్రెసిడెంట్ డాక్టర్ ఖండవల్లి లక్ష్మిపేర్కొన్నారు. హైదరాబాద్ జూబ్లీ హిల్స్ లోని ప్రసాద్ ల్యాబ్ లో ఆదర్శ కళానిలయం సంస్థ నిర్వహించిన వేడుకలో ఖండవిల్లి లక్ష్మిని స్వర్ణ నంది అవార్డుతో గత నెలలో ఘనంగా సత్కరించిన సంగతి తెల్సిందే. ఈనేపథ్యంలో ఆమె అభిమానులు ఊరేగింపుగా ఆమెను దివాన్ చెరువులోని ఇంటికి తీసుకొచ్చారు. గజమాలతో, పూలమాలలతో, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఖండవిల్లి లక్ష్మి మీడియాతో మాట్లాడుతూ తనకు ఇప్పటివరకు 10అవార్డులు వచ్చాయని గుర్తుచేసుకున్నారు. అయితే హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్ లో ఆదర్శ కళానిలయం సంస్థ నిర్వహించిన వేడుకలో



ఎంతోమంది సినిమాపెద్దలు, ఇతర పెద్దల సమక్షంలో స్వర్ణనంది అవార్డు అందుకోవడం మరిచిపోలేని అనుభూతి అని పేర్కొన్నారు. నా కష్టార్జితంలో కొంత సొమ్ము వెచ్చించి సేవా కార్యక్రమాలు చేస్తున్నానని తెలిపారు. నా కుటుంబ సభ్యులు సహకరిస్తున్నారని, ఎవరినీ యాచించడం లేదని ఆమె స్పష్టంచేసారు. కొంతమంది కావాలని పనిగట్టుకుని దుష్ప్రచారం చేయడం తగదని ఆమె హితవు పలికారు. తెలుగుదేశం పార్టీలో చురుగ్గా కార్యక్రమాల్లో పాల్గొంటూ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తున్నానని ఖండవిల్లి లక్ష్మి తెలిపారు. సీఎం పర్యటన వ్యవహారాల ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్, ఆయన తనయుడు పెందుర్తి అభిరాం అందిస్తున్న సపోర్టు మరువలేనిదన్నారు. అవార్డు వచ్చిన విషయం తెలుసుకుని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ చాలా సంతోషంగా ఉందని, అభినందనలు తెలిపారని ఆమె పేర్కొంటూ ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. దళితుల్లో ఎవరికి కష్టం వచ్చినా తనవంతుగా ఆదుకుంటానని, ఎవరికి అన్యాయం జరిగినా, స్పందించి ప్రశ్నిస్తానని ఆమె స్పష్టం చేసారు. జనసేనకు చెందిన బి.నాగేశ్వరరావు మాట్లాడుతూ దళితుల్లో చురుగ్గా పనిచేసి పైకి వస్తున్న ఖండవిల్లి లక్ష్మి లాంటి వాళ్లను ప్రోత్సహించాలని సూచించారు. ఆమెకు అవార్డు వచ్చినందుకు అభినందనలు తెల్పారు. ఖండవిల్లి లక్ష్మి నాయకత్వం వర్ధిల్లాలి, పెద్దమ్మ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ యువకులు నినదించారు.

# జనసేన జెండా ఏ దేశ భక్తి మతం నుండి పుట్టింది

- జీసెస్‌కు శిలువ వేసిన యూదు (జుడా)ల దేశ జండా నమూనాతో జనసేన పార్టీ ప్రచారం ఎందుకు సంకేతం
- జనసేన జండా నమూనా ఇజ్రాయిల్ దేశ యూదు మతం నుండి పుట్టిందా ! కాదా !
- భారత్ వంటి లౌకిక దేశంలో జనసేన జెండా ప్రభావం మత వివాదాలకు కారణం కావొచ్చు - ఆర్పీసీ అధినేత మేడా శ్రీనివాస్, సూటిప్రశ్న

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సనాతని హిందూ అంటు ఊగి పోయే పవన్ కళ్యాణ్ జనసేన పార్టి జెండా పోలిక ఏ దేశ మాతృ మతానిదో పవన్ కళ్యాణ్ చెప్పగలరా ! అని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (అర్పిసి) ప్రధాన కార్యాలయంలో జరిగిన పార్టి వారాంతపు సమావేశంలో అర్పిసి వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ మీడియా సమావేశం ద్వారా నేరుగా పవన్ కళ్యాణ్ ను కోరారు. మేడా మాట్లాడుతూ కరుడు కట్టిన "యూదు" ల పాత నిబంధన ప్రకారం ఇజ్రాయల్ దేశ మత యూదు బావజాలంతో పవన్ కళ్యాణ్ జనసేన పార్టి జండాను రూపొందించారు. ఆ నమూనాతొ జండా రూపకల్పన చేయటంలో అర్థం ఏమిటన్నారు. మరో ప్రక్క మూడు రాజకీయ జండాల ముచ్చటతో కూటమిలో అత్యున్నత మంత్రి పదవి అనుభవిస్తున్న పవన్ కళ్యాణ్ అంతర్గత జండా ఏమిటి ! అతని అజెండా ఏమిటో తెలపాలన్నారు. మతపరమైన అధ్యక్ష పాలనా దేశం అయిన ఇజ్రాయిల్ యూదు ల మూలాలు అత్యున్నత ప్రజాస్వామ్యం గల భారతదేశంలో జనసేన జెండా ప్రచారం సాగిస్తున్న వైనంను నిషేదించక పోతే భారత్ లో మత ఘర్షణ లకు అవకాశం ఇచ్చిన వారమవుతామని ఆయన ఆందోళ వ్యక్త పరిచారు. పవన్ కళ్యాణ్ సనాతని హిందూ అంటూనే ఇజ్రాయల్ యూదు(జుడా)బావజాలంతో పాత నిబంధన విశ్వాస జండా రూపంను తన పార్టి జండాగా ఆస్వాదిస్తు తెలుగు రాష్ట్రాల్లో తన పార్టి వారితోనే ఆ జండాను మోయిస్తున్నారు. మోదీ హిందూ మతమే తన అజెండా అంటారు. పవన్ కళ్యాణ్ హిందూ అంటూనే అప్పడప్పుడు క్రిస్టియన్ అంటుంటారు. కొన్ని సార్లు ఇస్లాం అంటుంటారు. ఒకొక్కసారి నాకు కులం,మతం ఎక్కడిదబ్బా నా కూతురు కృష్టియన్ అని చాలా గొప్పగా చెప్పుకుంటారు. పవన్ మాటలు నిజమైతే జీసెస్ క్రిస్ట్ కు కుట్ర పూరితంగా శిలువ వేసి మహా పాపనికి వడికట్టిన ఆ దేశపు బావజాలం గల జండా రూపంలో జనసేన జెండాను ఎందుకు రూపొందించుకున్నారో పవన్ కళ్యాణ్ సమాధానం చెప్పాలి. పవన్ కళ్యాణ్ సనాతని హిందూ అంటూనే హిందువులు ఆరాధ్య దైవంగా పూజించే "గో" మాంసాన్ని తినమని ప్రోత్సహిస్తుంటారు. పవన్ కళ్యాణ్ మాటలకు, చేష్టలకు అస్సలు పొంతన లేక పోతుందన్నారు. జనసేన పార్టి బావజాలం ఎవరికో ఎవరెవరికో మేలు చేయటమే లక్ష్యంగా ఆవిర్భవించిందా ! అని ఆయన సందేహం వ్యక్త పరిచారు. ఏపి , తెలంగాణా ప్రజలు మంచివారు,అమాయకులు కాబట్టి హిందువుల చేతనే ఇజ్రాయల్ యూదు స్వభావ మత రూపంలో గల జనసేన జండాను తన వారి భుజాన్న మొయిస్తున్నారు . హిందూ ధర్మానికి , లౌకిక రక్షణకు విఘాతంగా బావించే యూదు ల స్వభావం యావత్ జీసెస్ క్రిష్టియన్ బావజాలంకు వ్యతిరేకులు . ఇజ్రాయిల్ యూదు దేశ రూపంతో ఉన్నటువంటి జండాను జనసేన పార్టీలో గల హిందువులతో జై జై లు కొట్టించటం బాదాకరం . జీసెస్ క్రిస్ట్ కు శిలువ వేయించిన ప్రధాన కుట్ర దారులైన యూదు దేశ నమూనా గల జండాను జనసేన పార్టీలో గల జీసెస్ భక్తుల చేతనే మొయించటం క్షమించారాని నేరంగా పరిగణించాలి. ఈ పరిణామాలు మత సామరస్యానికి విఘాతంగా బావించాలన్నారు. ఆదిలో అన్ని మతాలు సమానం అని చెప్పుకున్న పవన్ కళ్యాణ్ మధ్య మధ్య లో ఊసరవెల్లిని మించిన అవతార పురుషుడుగా రాజకీయ రంగులు మార్చారు . తన కార్యాకర్తలతో ఏ జండా మొయించినా పరవాలేదు అనుకుంటే పవన్ కళ్యాణ్ సనాతని హిందూ అని చెప్పి మరి తన కార్యకర్తలతో పరమత జీసెస్ వ్యతిరేక యూదుల జెండా రూపంను మొయిస్తున్నారు. ఇలాంటి పనులు హిందూ ధర్మం క్షమిస్తుందా ! జీసెస్ విశ్వాసికులు అంగీకరిస్తారా ! భారత్ వంటి లౌకిక దేశంలో యూదు జెండా నమూనా ప్రచారం సాధ్యమేనా ! ఏదో ఒక రోజు రెండు తెలుగు రాష్ట్రాల్లో హిందూ చైతన్యం , జీసెస్ భక్తులు మేల్కొని ఇజ్రాయిల్ యూదు నమూనా జండాను తన కార్యకర్తలే చించి పడేసే పరిస్థితులు తప్పవని ఆయన హెచ్చిరిస్తున్నారు. సనాతని హిందూ రూపం ధరించి ఇజ్రాయిల్ యూదు (జుడా) స్వభావం గల జండా నమూనాను జనసేన పార్టి జండాగా తెలుగు రాష్ట్రాల్లో ఎగురవేయించటం యావత్ హిందూ సమాజం , క్రిష్టియన్స్ విశ్వాసాలను గాయపరిచినట్టేనన్నారు. ఆంధ్ర , తెలంగాణా ప్రజల యొక్క మనోభావాలను తీవ్రంగా దెబ్బతీస్తున్నారు. ఇజ్రాయిల్ యూదులు (జుడా) పాత నిబంధన పేరుతో సగం క్రిస్టియన్ బావజాలం అంటూనే జీసెస్ క్రిస్ట్ శాంతి సందేశానికి వ్యతిరేకులుగా వుంటా జుడా స్ సిద్ధాంతమే కన్నుకు కన్ను, పంటికి పన్ను, ప్రాణానికి ప్రాణం అనే బావజాలంతొ పెరిగిన వారు. మొత్తంగా జీసెస్ క్రిస్ట్ సందేశాలకు పూర్తి వ్యతిరేకులు . ఆ దేశ సిద్ధాంతం ఆ దేశం యొక్క పరిస్థితులకు ఇజ్రాయిల్ వంటి యూదు దేశంలో చెల్లుబాటు అవ్వొచ్చును . అత్యున్నత ప్రజాస్వామ్యం గల భారతదేశంలో పవన్ కళ్యాణ్ జండా ప్రభావం ప్రజా రక్షణకు , సామాజిక భద్రతకు పెను ప్రమాదం కాదని జనసేన పవన్ కళ్యాణ్ చెప్పగలరా



! ఇజ్రాయిల్ యూదు దేశ జెండా నమూనాతొ లౌకిక దేశం అయిన భారతదేశంలో జనసేన జండాను తిప్పటం శాంతి భద్రతల సమస్యలు తలెత్తె ప్రమాదాలకు సంకేతాలుగా ఏర్పాడొచ్చును . తెలుగు రాష్ట్రాల భద్రత దృష్ట్యా , భారతదేశం లౌకిక భద్రతను , సమగ్రతను కాపాడే కాపాడే భాద్యతగా తక్షణమే జనసేన పార్టి జండా ను మార్చుకోవాలన్నారు . ప్రస్తుత జనసేన జెండా మూలంగా దేశ సమగ్రత , సార్వ భౌమాధికారం దెబ్బతింటున్నాయన్నారు .. భారతదేశంలో పురుడు పోసుకున్న రాజకీయ జండాలో పూర్తిగా భారతీయ మూలాలు మాత్రమే కనపడాలన్నారు. ఇతర దేశ మత మూలాలు, మత విశ్వాసాలు కనపడకూడదని ఆయన పేర్కొన్నారు. మోదీ సర్కార్ పూర్తిగా హిందూ మత విశ్వాసాల పై నడుస్తున్న పార్టి, ఆంధ్రప్రదేశ్ లో చంద్రబాబు కూటమి సర్కార్ అన్ని మతాలు సమానం అని చెప్పుకునే రాజకీయ పార్టి, పవన్ కళ్యాణ్ ప్రస్తుతం హిందూ సనాతని అంటూనే పూర్తిగా జీసెస్ క్రీస్తు కు శిలువ వేసిన యూదుల స్వభావం యొక్క జండా నమూనాతొ జనసేన పార్టి జెండా ను రూపొందించుకున్నారు. ప్రస్తుతం కొన్ని మత ఉన్మాద శక్తులు ఈ మధ్య అనేక సోషల్ మీడియా వేదికల ద్వారా హిందూ మతాన్ని, రామాయణ, మహా భారత పవిత్ర ఘట్టాలను, కొంతమంది క్రిస్టియన్ మత విశ్వాశాలను, మరి కొంతమంది ఇస్లాం ఆచారాలని పచ్చి పచ్చిగా విమర్శలు , ఆరోపణలు చేసున్నారు. ప్రజల దైవ విశ్వాసాలను రెచ్చ గోడుతున్నారు . ఇలాంటి వారిని కట్టడి చేయటంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయి . ఇలాంటి పరిస్థితుల్లో జీసెస్ క్రిస్ట్ కు శిలువ వేసిన యూదు స్వభావ నమూనా జండాతొ ఆంధ్ర - తెలంగాణా రాష్ట్రాల్లో జనసేన పార్టి ప్రచారం చేసుకోవటం ఎంత మేరకు భద్రతగా నిలుస్తుంది . ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో కొంతమంది మతోన్మాదులు శృతిమించిన మత ప్రచారాలను కొన్ని గ్రామాల్లో ప్రజలు అడ్డుకుంటున్నారు . భవిష్యత్ లో జీసెస్ క్రిస్ట్ కు శిలువ వేసిన యూదు జెండా నమూనాతొ జనసేన పార్టి జెండాలు గ్రామాల్లో కనపడితే జీసెస్ విశ్వాసకుల ఆగ్రహఆవేశాలు సామజిక భద్రతకు ప్రమాదంగా మారవంటారా ! ప్రస్తుత జనసేన పార్టి జెండా కేంద్ర రాష్ట్ర కూటమి సర్కార్ లకు కూడా శంకటిత పరిస్తుతులే నని మోదీ - చంద్రబాబు వంటి రాజకీయ దిగ్గజాలు భవిష్యత్ ప్రమాదాన్ని గుర్తించి జాగ్రలు తీసుకోవటం ఖాయం అన్నారు . భవిష్యత్ లో మత సామరస్యానికి ప్రమాదంగా మారే జనసేన పార్టి జండా పరిస్థితులను నిఘా వర్గాలు గుర్తించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదికను సమర్పించాలన్నారు . ఈ ఆందోళన పరిస్థితులను జనసేన పార్టి అధినేత పవన్ కళ్యాణ్ కూడా సహృదయంతొ గుర్తించి తన జండా రూపంను మార్చుకోవాలని, రాజకీయ కోణంలో వివాదంగా మార్చే ఆలోచనలు చేస్తే జనసేన పార్టికి మంచి పరిణామాలు కావని, భారత్ వంటి ప్రజాస్వామ్య దేశంలో రాజకీయాలకు అతీతంగా మత సామరస్యాన్ని కాపాడే భాద్యతపై జనసేన పార్టి సైతం ఆలోచన చేయాలని ఆయన సూచించారు. జనసేన పార్టి జెండాపై భారత రాష్ట్రపతి వారికి, భారతదేశ ప్రధాన మంత్రివర్యులుకు, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తుల వారికి తెలియచేస్తాం అని ఈ సందర్బంగా ఆర్పీసీ అధ్యక్షులు మేడా శ్రీనివాస్ తెలిపారు. ఈ సభకు ఆర్పీసీ సీనియర్ సెక్యులర్ మేడిచర్ల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో అర్పిసి సెక్యులర్స్ సర్వశ్రీ లంక దుర్గాప్రసాద్, పెంద్యాల కామరాజు, డి వి రమణమూర్తి, సిమ్మా దుర్గారావు, దుడ్డే త్రినాద్, కారుమూరి యుగంధర్, దుడ్డే సురేష్, వర్ధనపు శరత్ కుమార్, ఆకుల మణికాంత్, గుడ్ల సాయి దుర్గా ప్రసాద్, వల్లి శ్రీనివాసరావు, వాడపల్లి జ్యోతిష్, ముగ్గళ్ళ రాజేష్, ముప్పన రమేష్, కారుమూరి శిరీష, బసా సోనియా, యర్రా బాల మురళి కృష్ణ, కాకర ప్రసాద్, చల్లా సాయి దుర్గా ప్రసాద్, కొల్లి సత్య నారాయణ, చల్లా ప్రసాద్, కందివలస రమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సహస్ర గళ ఏకాదశ సహస్ర

# హనుమాన్ చాలీసా యజ్ఞం : నాగభూషణం

**వైభవంగా విద్యార్థులు నరసన్న గిరి ప్రదక్షణ**





**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ స్వయంభు శ్రీ లక్ష్మి నరసింహస్వామి వారి కల్యాణ మహోత్సవాల సందర్భంగా ఆదివారం సహస్ర గళ ఏకాదశ హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞం, గిరి ప్రదక్షిణ ఘనంగా నిర్వహించినట్లు హిందూ ధర్మ పరిరక్షణ సేవా సమితి నిర్వాహకులు నాగభూషణం తెలిపారు. ఆదివారం కోరుకొండ శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి కళ్యాణ మండపంలో ప్రైవేట్ పాఠశాలల ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులు 11 మార్లు హనుమాన్ చాలీసా పారాయణ భక్తిశ్రద్ధలతో పఠనమ చేశారన్నారు. కోరుకొండ, గోకవరం, సీతానగరం, రాజానగరం, కొవ్వూరు మండలాలకు చెందిన 30కి పైగా పాఠశాలల నుండి 1,008 మంది చిన్నారులతో 11 పర్యాయాలు హనుమాన్ చాలీసా పారాయణ, నరసన్న మస్మరణలతో గిరి ప్రదక్షిణతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మిక వాతావరణం సంతరించు కుందన్నారు. సుమారుగా 1,500 మంది విద్యార్థిని విద్యార్థులు ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొనడం, హిందూ సంస్కృతి సంప్రదాయాలకు నిలువుటద్దంగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా హనుమాన్ జెండాలతో వందల సంఖ్యలో భారీ ర్యాలీ "గిరి ప్రదక్షిణ" ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమానికి అదనపు ఎస్పీ చెంచురెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని చిన్నారులకు హిందూ సంస్కృతి సాంప్రదాయాల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ విద్యాసంస్థల అధినేతలు, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వారణాసి శ్రీశ్రీశ్రీ శివ నాగేంద్ర సరస్వతీ స్వామి వారికి ఘన స్వాగతం



**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** వారణాసి నుండి శ్రీశ్రీశ్రీ శివ నాగేంద్ర సరస్వతీ స్వామి ఆదివారం మండపేట విచ్చేశారు. ఆయన ఐదు రోజుల పాటు ఇక్కడ ఉండి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో నిర్వహించే పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా మండపేట కలువపువ్వు సెంటర్ వద్ద ఆయనకు ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు, చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గా రాణి, బీజేపీ సీనియర్ నాయకులు కోన సత్యనారాయణ, పారిశ్రామికవేత్త వి సాయి కుమార్ బాబు, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు వేగుళ్ళ పట్టాభి రామయ్య చౌదరి, వైస్ చైర్మన్ వేగుళ్ళ నారయ్య బాబు లు స్వాగతం పలికారు. పూర్ణ కుంభ మేళం తో అర్చకులు అయినవిల్లి సోమనాథ శర్మ, వంక సూర్యనారాయణ లు వేద మంత్రాలతో స్వామి వారికి స్వాగతం పలికారు. మేళ తాళాలు మంగళ వాయిద్యాలు, కోలాట నృత్యాలు తో మహిళలు ఆయనకు బ్రహ్మరథం పట్టారు. తొలుత కౌన్సిలర్ రాజేశ్వరి అమ్మవారి పీఠం నిర్వాహకులు గ్రంధి శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించిన అశ్వ రథం పై ఆసీనులు చేశారు. ప్రజలకు అభివాదం చేస్తూ స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు.మండపేట ధర్మగుండం చెరువు ప్రాంతంలో శ్రీ రాజరాజేశ్వరి పీఠం దుర్గమ్మ సేవలలో గ్రంధి మంగాయమ్మ ఉండేవారు. గతంలో ఆమె శివైక్యం పొందారు. దుర్గమ్మ కుమారుడు కౌన్సిలర్ గ్రంధి శ్రీనివాస్ పీఠాన్ని నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో రాజరాజేశ్వరి పీఠానికి వారణాసి నుండి శ్రీశ్రీశ్రీ శివ నాగేంద్ర సరస్వతీ స్వామి విచ్చేశారు. ఐదు రోజుల పాటు ఆధ్యాత్మిక పర్యటన లో భాగం గా ధర్మగుండం చెరువు వద్ద ఉన్న రాజరాజేశ్వరి పీఠం లో మకాం ఉంటారు కలువపువ్వు సెంటర్ నుండి భక్తజన సందోహంతో ధర్మగుండం రాజరాజేశ్వరి దుర్గమ్మ పీఠానికి చేరుకున్నారు. స్వామీజీ పర్యటనలో భక్తులకు వాక్యోపదేశం ఈ నెల 2 సాయంత్రం 6 గంటలకు ధర్మగుండం శ్రీసీతారామ కమ్యూనిటీ హాల్లో భక్తులను ఉద్దేశించి ప్రవచన కార్యక్రమం నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కో ఆప్షన్ సభ్యులు రెడ్డి రాధాకృష్ణ, ఉంగరాల రాంబాబు, కురసాల సత్యనారాయణ, అవసరాల వీర్రాజు, బొల్లంరెడ్డి సత్యనారాయణ, శెట్టి రవి కుమార్, సల్మాన్ హుస్సేన్, చంద్రు సోమరాజు,శిరంగు ఈశ్వరరావు,కౌన్సిలర్ బొక్కా సరస్వతి, కడియాల వెంకట లక్ష్మి, మచ్చా నాగు, వాదా ప్రసాద్,మహిళలు, భక్తులు విశేష సంఖ్య లో పాల్గొన్నారు.

# పలువురిని పరామర్శించిన రెడ్డి రాధాకృష్ణ



**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** మండపేట మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు రెడ్డి రాధాకృష్ణ ఆదివారం పలువురు వైసిపి నాయకులను పరామర్శించారు. వైయస్సార్ పార్టీ 17 వార్డు ఇంచార్జి దుగ్గిరాల గణేష్ ఇటీవల రోడ్ ప్రమాదంకు గురి అయి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. వైసిపి రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. అనంతరం వైస్సార్సీపీ సీనియర్ నాయకులు, వడ్రంగి పనివార్ల యూనియన్ రాష్ట్ర ఉప అధ్యక్షులు రామోజు కృష్ణ కుమార్డు అభిరామ్ ఇటీవల ద్విచక్ర వాహనం ప్రమాదం లో గాయపడి కోలుకుంటున్నారు.ఆయన్ని పలకరించి యోగ క్షేమలు అడిగి తెలుసుకున్నారు. ఇరువురిని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమం లో సొసైటీ మాజీ అధ్యక్షుడు పెంకే గంగాధర్, శివకోటి శేష సుబ్రహ్మణ్యం, పంపన శ్రీను, లేగా వెంకటేశ్వరరావు, రామోజు కృష్ణ, కాద శ్రీనుబాబు, చోల్లంగి సూరిబాబు పాల్గొన్నారు.

# నాగ్‌పుర్‌లో భారీ పేలుడు.. 17 మంది మృతి

**విశ్వం వాయిస్ న్యూస్ :** మహారాష్ట్రలోని నాగ్‌పుర్‌లో భారీ పేలుడు సంభవించింది. కటోల్‌లోని పేలుడు పదార్థాల తయారీ పరిశ్రమ ఎస్‌బీఎల్ (రాదీూ) ఎనర్జీ లిమిటెడ్‌లో తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంలో 17 మంది మృతిచెందగా.. 18 మంది తీవ్రంగా గాయపడినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని బయటకు తీయడానికి సహాయక చర్యలు కొనసాగుతున్నాయన్నారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రమాదం జరిగిన పరిశ్రమలో డిటోనేటర్లు, కాస్ట్ బూస్టర్లు, భూకంప పేలుడు పదార్థాలు తయారు చేస్తారని స్థానికులు వెల్లడించారు. ఉదయం ఇందులోని ఒక యూనిట్‌లో అకస్మాత్తుగా పేలుడు సంభవించిందని.. ఆ సమయంలో, 30 మందికి పైగా ఉద్యోగులు వివిధ యూనిట్లలో పనిచేస్తున్నారని తెలిపారు.

**సీఎం ఫడణవీస్ దిగ్భ్రాంతి**

ప్రమాదంపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని.. అధికారులతో తాను నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నానని పేర్కొన్నారు. సహాయక చర్యలను వేగవంతం చేయాలని..గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపడతామని తెలిపారు.



# వంటింటి చిట్కాలే 'యానిమల్' బ్యూటీ త్రిప్తి దిమ్రి సౌందర్య రహస్యం

సినిమా ప్రపంచంలోకి గాలివాటంలా వచ్చి, తన నటనతో స్టార్? హీరోయిన్?గా మారిపోయింది హాట్? బ్యూటీ. ఒక వైపు భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉంటూనే, మరోవైపు తన సహజ సిద్ధమైన అందంతో అభిమానులను మంత్రముగ్ధులను చేస్తోంది. కెమెరా ముందు ఎంత గ్లామరస్‌గా కనిపిస్తుందో, నిజ జీవితంలో అంత సింపుల్‌గా ఉండటానికే ఆమె మొగ్గు చూపుతుంది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో తన సౌందర్య రహస్యాలను, జీవనశైలిని పంచుకున్న విశేషాలేంటో తెలుసుకుందాం. ఆమె ఒకప్పుడు కేవలం మోడల్, కానీ 'యానిమల్' సినిమా తర్వాత ఒక్కసారిగా దేశవ్యాప్తంగా సెన్సేషన్ సృష్టించింది. ఆమె స్క్రీన్ ప్రెజెన్స్ చూసి కుర్రకారు ఫిదా అయిపోయారు. ఇంత అందంగా ఉండటానికి ఆమె వేల రూపాయల బ్యూటీ ప్రొడక్ట్స్ వాడుతుందని అందరూ అనుకుంటారు. కానీ ఆమె మాత్రం "అందం అంటే ఖరీదైన వస్తువుల్లో లేదు, మనం తీసుకునే జాగ్రత్తల్లో ఉంది" అని చెబుతోంది. తన చర్మ సౌందర్యం కోసం అనాదిగా వస్తున్న మన భారతీయ పద్ధతులనే నమ్ముతున్న ఆ సెన్సేషనల్ బ్యూటీ మరెవరో కాదు.. త్రిప్తి దిమ్రి. చాలా మంది హీరోయిన్లు గంటల తరబడి స్కిన్ కేర్ కోసం సమయం కేటాయిస్తుంటే, త్రిప్తి మాత్రం చాలా సింపుల్ పద్ధతులను పాటిస్తుంది. ఆమె ఉదయం నిద్రలేవగానే ముఖాన్ని శుభ్రం చేసుకుని, అప్పుడప్పుడు విటమిన్-సి సీరమ్ వాడుతుంది. ఆ తర్వాత తేలికపాటి మాయిశ్చరైజర్, సన్ స్క్రీన్ రాసుకోవడం ఆమెకు అలవాటు. ముఖ్యంగా తన టీ-జోన్ (నుదురు, ముక్కు భాగం) జిడ్డుగా మారకుండా ఉండేందుకు తక్కువ ఆయిలీగా ఉండే ప్రొడక్ట్స్ ఎంచుకుంటుంది.

**బామ్మ కాలం నాటి చిట్కాలు..**

ఆధునిక సౌందర్య సాధనాల కంటే త్రిప్తికి వంటింటి చిట్కాలంటేనే ఎక్కువ మక్కువ. జుట్టు సంరక్షణ కోసం ఆమె ఆమ్లా (ఉసిరి), రీటా, షికాకాయ్ వంటి సహజ సిద్ధమైన వస్తువులనే వాడుతుంది. అలాగే చర్మం మెరిసిపోవడానికి శనగపిండి, పెరుగు, పసుపు కలిపిన మిశ్రమాన్ని ఫేస్ ప్యాక్‌గా ఉపయోగిస్తుంది. ముఖ్యంగా వాతావరణం మారినప్పుడు చర్మం పొడిబారకుండా ఉండటానికి ఈ సహజ పద్ధతులే తనకు ఎంతో సహాయపడతాయని ఆమె వెల్లడించింది. అందం కేవలం బయట కనిపించే అలంకరణలోనే కాదు, మనం తీసుకునే ఆహారం, చేసే వ్యాయామంపై కూడా ఆధారపడి ఉంటుందని త్రిప్తి నమ్ముతుంది. ఆమె క్రమం తప్పకుండా పైలేట్స్ వ్యాయామాలు చేస్తుంది. ఆహారం విషయంలో ఆమె మరీ కఠినంగా ఉండదు.

సినీ వాయిస్ CINEMA

# అల్లు ఇంట సందడి చేసిన విజయ్ రష్మిక..



అల్లు ఇంట పెళ్లి సందడి మొదలైంది. ఇప్పటికే ప్రీ వెడ్డింగ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మెగా ఫ్యామిలీ, అల్లు ఫ్యామిలీ కలిసి అల్లు శిరీష్ పెళ్లి వేడుకల్లో సందడి చేస్తున్నారు. అయితే తాజాగా శిరీష్ పెళ్లి కొడుకు వేడుకకు కొత్త జంట రష్మిక, విజయ్ దేవరకొండ హాజరయ్యారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోస్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. విజయ్ దేవరకొండ, రష్మిక కొన్ని సంవత్సరాలుగా ప్రేమిచుకొని, ఫిబ్రవరి 26న ఘనంగా వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. గీతా గోవిందం మూవీలో కలిసి నటించిన వీరు, డియర్ కామ్రేడ్ మూవీ సమయంలో ప్రేమలో పడ్డారు. తర్వాత నుంచి వీరి ప్రేమ గురించి అనేక వార్తలు వచ్చాయి. కానీ వీటిపై వీరు ఎప్పుడూ స్పందించలేదు. ఏకంగా వెడ్డింకార్డుతో తమ అభినులకు సర్‌ప్రైజ్ ఇచ్చారు. వారి ప్రేమను తెలుపుతూ, తామ వివాహ బంధం గురించి తెలియజేశారు. అతి కొద్ది మంది సమక్షంలో ఉదయ్ పూర్‌లలో రెండు సంప్రదాయాల ప్రకారం ఘనంగా వివాం చేసుకున్నారు. ఇక వివాహం అనంతరం హైదరాబాద్ చేరుకున్న ఈ జంట, మార్చి 4న రిసెప్షన్ చేసుకోనున్నారు. ఈ క్రమంలో వివాహం తర్వాత ప్రముఖలను కలిసి వారి రిసెప్షన్ వేడుకకు రావాలని ప్రత్యేకంగా ఆహ్వానించారు. అంతే కాకుండా వివాహం తర్వాత వీరు ఎక్కడ కనిపించినా వారి ఫొటోలు తెగ వైరల్ అవుతున్నాయి. అయితే తాజాగా ఈ కొత్త జంట అల్లు ఇంట సందడి చేసింది. మార్చి6న అల్లు శిరీష్ పెళ్లి జరగనున్న విషయం తెలిసిందే. అయితే శిరీష్ పెళ్లి కొడుకు వేడును ఘనంగా చేశారు. ఈ కార్యక్రమానికి విరోష్ జంట హాజరైంది. ఈ క్రమంలో విజయ్ దేవరకొండను, రష్మికను అల్లు అరవింద్, అల్లు అర్జున్ అభినందించారు. ఈ నవ జంట వారితో కాసేపు ఆనందంగా గడిపింది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోలు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. మరి మీరు కూడా ఈ ఫొటోలపై ఓ లుక్ వేయండి.



క్రీడా వాయిస్

# టాస్ గెలిచిన భారత్..

## టీమిండియా ప్లేయింగ్ 11 ఎలా ఉందంటే?



టీ20 ప్రపంచ కప్‌లో చివరి సూపర్ 8 మ్యాచ్ భారత్ వర్సెస్ వెస్టిండీస్ మధ్య జరుగుతోంది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో మొదలైన ఈ మ్యాచ్ లో టీమిండియా టీం టాస్ గెలిచిన ముందుగా బౌలింగ్ ఎంచుకుంది. ప్రపంచ కప్‌లో కోల్‌కతాలో రెండు జట్లు తలపడటం ఇదే తొలిసారి. కాగా, ఇరుజట్లకు ఈమ్యాచ్ ఎంతో కీలకంగా మారింది. గెలిచిన జట్టు సెమీస్ చేరుకుంటుంది. ఓడిన టీం సెమీస్ రేసు నుంచి తప్పుకుంటుంది.

**భారత్:** సంజు శాంసన్(కీపర్), అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, సూర్యకుమార్ యాదవ్(కెప్టెన్), హార్దిక్ పాండ్యా, తిలక్ వర్మ, శివమ్ దూబే, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చకరవర్తి, జస్ప్రీత్ బుమ్రా.

**వెస్టిండీస్ :** షాయ్ హోప్(కీపర్/కెప్టెన్), రోస్టన్ చేజ్, షిమ్రాన్ హెట్మెయర్, రోవ్‌మన్ పావెల్, షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్, రొమారియో షెపర్డ్, జాసన్ హోల్డర్, మాథ్యూ ఫోర్డే, అకేల్ హోసేన్, గుడాకేష్ మోటీ, షమర్ జోసెఫ్.

# వార్ ఎఫెక్ట్.. ఐపీఎల్ 2026 ప్రారంభ తేదీలో మార్పు.. ఎప్పుడంటే?




ఐపీఎల్ 2026పై కీలక మార్పు చోటుచేసుకుంది. నగదు వర్షం కురిపించే ఈ టోర్నమెంట్ అసలు షెడ్యూల్ ప్రకారం మార్చి 26న ప్రారంభం కావాల్సి ఉండగా, ఇప్పుడు అది రెండు రోజుల పాటు వాయిదా పడినట్లు సమాచారం. తాజా నివేదికల ప్రకారం ఐపీఎల్ 2026 మార్చి 28న ప్రారంభమయ్యే అవకాశముంది. ఐపీఎల్ 2026 ప్రారంభానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైన సమయంలోనే టోర్నమెంట్‌కు అనూహ్య అడ్డంకి ఎదురైంది. బీసీసీఐ ఐపీఎల్ 2026 ప్రారంభ తేదీని మార్చి 28, 2026కు మార్చినట్లు సమాచారం. అయితే మధ్యప్రాచ్యంలో పెరుగుతున్న భౌగోళిక ఉద్రిక్తతలు అంతర్జాతీయ ఆటగాళ్ల ప్రయాణాలపై ప్రభావం చూపుతున్నాయి. అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య తాజా సైనిక పరిణామాల వల్ల కీలక విమాన మార్గాలు దెబ్బతిన్నాయి. దీంతో ఐపీఎల్ ఫ్రాంచైజీలు, ఐసీసీ ప్రత్యామ్నాయ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**విదేశీ ఆటగాళ్లపై ప్రభావం..**

ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్ వంటి దేశాల నుంచి వచ్చే ఆటగాళ్లు సాధారణంగా దుబాయ్, అబుదాబి వంటి గల్ఫ్ హబ్‌ల ద్వారా భారత్ చేరుతారు. ప్రస్తుతం కొన్ని ఎయిర్‌లైన్స్ ఈ ప్రాంతాలకు విమాన సర్వీసులు నిలిపివేయడంతో ప్రయాణాలు క్లిష్టంగా మారాయి.

**భద్రతా ఆందోళనలు:** అలాగే, కొంతమంది విదేశీ ఆటగాళ్లు ప్రయాణించేందుకు సంకోచిస్తున్నట్లు సమాచారం.

**ఐసీసీ చర్యలు:** భారత్, శ్రీలంకలో జరుగుతున్న టీ20 వరల్డ్ కప్ 2026 తుది దశలను పర్యవేక్షిస్తున్న ఐసీసీ ఇప్పటికే "ట్రావెల్ సపోర్ట్ డెస్క్"ను ప్రారంభించింది. గల్ఫ్ ప్రాంతాన్ని తప్పించేందుకు యూరప్, దక్షిణాసియా మార్గాల ద్వారా ఆటగాళ్లను రీ-రూట్ చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

**బీసీసీఐ స్పందన – షెడ్యూల్ మార్పులు..**

బీసీసీఐ పరిస్థితిని సమీక్షిస్తూ దేశీయ షెడ్యూల్ సవాళ్లను కూడా ఎదుర్కొంటోంది.

**కొత్త తేదీలు:** ఐపీఎల్ 2026 ఇప్పుడు మార్చి 28 నుంచి మే 31, 2026 వరకు జరగనుంది.

**రెండు దశల్లో షెడ్యూల్:** మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, అసోం రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో షెడ్యూల్‌ను రెండు భాగాలుగా విడుదల చేసే అవకాశముంది. 2024 సీజన్ తరహాలో ఈ విధానం ఉండొచ్చు.

**వేదికల మార్పు:** ప్రయాణ పరిమితులు కొనసాగితే, గల్ఫ్ మార్గాన్ని పూర్తిగా తప్పించి, అందరిక ఆమోదయోగ్యమైన అంతర్జాతీయ కనెక్టివిటీ ఉన్న వేదికలను ప్రాధాన్యం ఇవ్వవచ్చు. మొత్తానికి, ఐపీఎల్ 2026పై మధ్యప్రాచ్య పరిస్థితుల ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. అయినప్పటికీ బీసీసీఐ, ఐసీసీ సంయుక్తంగా చర్యలు తీసుకుంటూ టోర్నమెంట్‌ను సాఫీగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నాయి.

విశ్వం వాయిస్ తెలుగు దినపత్రికలో వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైం వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com